మాస పత్రిక

పైగామ్ ఎ హిదాయత్

(దైవ సందేశం)

సంపుటి: 3 సంచిక: 8

ఆగష్టు 2015 వెల: 20/-

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

నాజిమ్, ఇదారా అష్రఫుల్ ఉలూమ్

చందాలు, అభిప్రాయాలు
పంపవలసిన చిరునామా

Editor,
Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony, Saidabad,
Hyderabad - 500059.
Phone: 9030557865

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH

మన దేశ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ సీర్షికలో ప్రత్యేక వ్యాసాలు ప్రచురించడం వల్ల రెగ్యులర్ కాలమ్స్ ఆదర్శ జీవిత చరిత్ర, సందేహాలు-సమాధానాలు, సార్వజనీన వార్తలు ప్రచురించలేకపోతున్నాము. అయినప్పటికి పాఠకుల తరఫున వచ్చిన కొన్ని సందేహాలకు మాత్రం మొదటి రెండు కాలమ్స్ చివరిలో సమాధానాలు ప్రచురిస్తున్నాము.

ఈ సంచికలో....

ఖుర్‌ఆన్ సందేశం 4
హదీసు సందేశం 11
ఒక ప్రత్యేక దుఆ 12
స్వాతంత్ర్యోద్యమం-ముస్లింలు 14
స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు 21
సందేహాలు-సమాధానాలు 42

ఖుర్ఆన్ సందేశం

సూరతుల్ ఫీల్

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రజియల్లాహు అన్హు గారి కథనం ప్రకారం దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ విధంగా సెలవిచ్చారు: ఖుర్ఆన్ (పఠించడం) నేర్చుకోని, ఖుర్ఆన్‌ను పఠిస్తుండండి. అల్లాహ్ తఆలా మీరు పఠించే ప్రతి అక్షరానికి బదులు పది పుణ్యాలు ప్రసాదిస్తారు.

بسم الله الرحمن الرحيم

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ నామముతో ఆరంభిస్తున్నాను.

أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِأَصْحَابِ الْفِيلِ

అలమ్ తర కైఫ ఫఅల రబ్బుక బిఅస్హాబిల్ ఫీల్

ఏమీ? ఏనుగు వారి (సైన్యంతో) నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా?

أَلَمْ يَجْعَلْ كَيْدَهُمْ فِي تَضْلِيلٍ

అలమ్ ఎజ్అల్ కైదహుమ్ ఫీ తజ్లీల్

ఏమీ? ఆయన వారి కుట్రను భంగం చేయలేదా?

وَأَرْسَلَ عَلَيْهِمْ طَيْرًا أَبَابِيلَ

వ అర్సల అలైహిమ్ తైరన్ అబాబీల్

ఆయన వారిపై పక్షుల గుంపులను పంపాడు.

تَرْمِيهِمْ بِحِجَارَةٍ مِنْ سِجِّيلٍ

తర్మీహిమ్ బిహిజారతిమ్ మిన్‌సిజ్జీల్

అవి వారి పై సిజ్జీల్ (మట్టితో చేసి కాల్చిన కంకర రాళ్ళను) విసిరాయి.

فَجَعَلَهُمْ كَعَصْفٍ مَأْكُولٍ

ఫ జఅలహుమ్ కఅస్ఫిమ్ మత్‌కూల్

ఆ విధంగా ఆయన వారిని (పశువులు) తినివేసిన పొట్టుగా మార్చివేశాడు.

సూరే ఫీల్ గురించి:

ఈ సూరహ్ సూరతుల్ ఫీల్, ఇది మక్కా నగరములో అవతరించింది. ఇందులో 5 ఆయతులు (సూక్తులు, వచనాలు) ఉన్నాయి. ఇందులో అల్లాహ్ గృహమైన కాబాను ధ్వంశం చేయాలనే దురుద్దేశముతో వచ్చిన అబ్‌రహా మరియు అతడి సైన్యం యొక్క ప్రస్తావన ఉంది. వారు ఏనుగుల సహాయముతో కాబాను పడగొట్టాలని అనుకున్నారు. అందుకే వారిని "అస్‌హాబిల్ ఫీల్" ఏనుగుల వారు అని సంబోధించడం జరిగింది, ఈ సూరా మొత్తం వారి ప్రస్తావనతో నిండి ఉండడం వల్ల ఈ సూరా "ఫీల్" అని పేరుగాంచింది. ఈ సూరా యొక్క భావం మరియు దాని సందేశం తెలుసుకునే ముందు ఈ సూరాలో ప్రస్తావించబడిన అబ్రహా మరియు అతడి సైనికుల వృత్తాంతాన్ని వివరంగా చూద్దాం.

అబ్రహా మరియు అతడి సైనికుల వృత్తాంతము:

సూరతుల్ బురూజ్ యొక్క నాల్గవ వచనములో "అస్‌హాబుల్ ఉఖ్‌దూద్" యొక్క ప్రస్తావన మనం క్రిందటి సంచికలలో చూశాము. హిమ్‌యర్ అనే దేశానికి చెందిన చివరి రాజు జూ నవాస్. అతడు ఓ బహుదైవారాధకుడు. అతడు క్రైస్తవులైన అస్‌హాబుల్ ఉఖ్‌దూద్‌పై దాడి చేసి వారిని నిర్దాక్షిన్యంగా చంపేశాడు. అప్పట్లో వారు దాదాపుగా 20,000 మంది ఉండేవారు. కాని ఇతడి క్రూరత్వానికి వారిలో ఎవ్వరూ మిగల్లేదు. కేవలం దౌస్ జూ సాలబాన్ ఎలాగొలా తప్పించుకొని షామ్ అదే దేశానికి చేరుకున్నాడు. అక్కడ పరిపాలిస్తున్న క్రైస్తవ రాజు కైసర్‌ను ఆశ్రయించి, అతడి సహాయము కొరకు అర్థించాడు. కాని వారి ప్రాంతం అక్కడ నుండి చాలా దూరము కావడం వల్ల అతడు వారికి దగ్గరలో ఉన్న మరో క్రైస్తవ దేశం హబ్‌షా (అబసీనియా) ను పరిపాలిస్తున్న నజాషీకు ఓ లేఖ వ్రాసి, వారికి మద్దత్తు అందించాలని కోరాడు. నజాషీ దానికి స్పందించి ఓ పెద్ద సైన్యానికి "అర్యాత్" మరియు "అబ్‌రహా" అనే ఇద్దరిని సైనాధిపతులుగా నియమించి జూ సాలబాన్ వెంట యమన్‌కు పంపించాడు. ఆ పరాక్రమ సైన్యం ముందు బహుదైవారాధకులైన హిమ్‌యరీలు నిలువలేకపోయారు. వారిని క్షణాలలో మట్టికర్పించారు. జూ నవాస్ పారిపోడానికి ప్రయత్నిస్తూ నీట మునిగి మరణించాడు. హబషీయులు యమన్‌పై ఆధిపత్యాన్ని సాధించారు. అర్‌యాత్, అబ్‌రహా ఇద్దరు కలిసి యమన్‌ను పరిపాలించసాగారు. కాని ఒక దేశానికి ఇద్దరుపరిపాలకులు సమర్థవంతంగా పరిపాలించినట్లు చరిత్రలోనే లేదు. వీరిద్దరి మధ్య కూడా విభేదాలు తలెత్తాయి. చివరికి ఒకరోజు ఇద్దరు తమ తమ సహచరులతో కలసి కయ్యానికి దిగారు. కాని మనిద్దరి గొడవలో ఇంత మంది ఎందుకు కొట్టుకుచావాలి? మనిద్దరమే రంగంలోకి దిగుదామ్, నెగ్గినవాడిదే రాజ్యం అని ఒకరికొకరు చెప్పుకున్నారు. అర్యాత్ చేసిన తొలి దాడికే అబ్‌రహా గాయపడ్డాడు. ఒకే దెబ్బతో అతడి ముఖము, ముక్కు, నోరును చీరేశాడు. ఇంతలో అబ్‌రహా యొక్క బానిస అయిన అతూదహ్ అర్యాత్‌పై మెరుపు దాడి చేసి అతడ్ని హతమార్చాడు. తీవ్రంగా గాయపడిన అబ్‌రహా కొంత కాలానికి కోలుకొని అబసీనియా నుండి వచ్చిన సైన్యాన్ని తన ఆధీనములోకి తీసుకొని యమన్‌ను పరిపాలించసాగాడు. నజాషీకి ఈ విషయం తెలియగా అతడు అబ్‌రహాపై తన

ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. చేసిన ఘనకార్యానికి అతడిపై నిప్పులు జల్లాడు. ఒక లేఖలో త్వరలో అతడిపై దండ ఎత్తడానికి వస్తున్నట్లు, అతడి జుట్టు పటుకొన్ని అతడ్ని ఈడ్చుకు రావడం ఖాయం అంటూ దేవుని సాక్షిగా చెప్పాడు. అబ్రహ వెంటనే వినయవినమ్రతలు చాటుతూ ఓ లేఖ వ్రాసి, క్షమాపణలు కోరుకున్నాడు. ఎంతో ఖరీదైన బహుమానాలు ఒక ఖాసిద్ ద్వారా పంపి రాజు ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రయత్నించాడు. ఒక సంచిలో యమన్ దేశపు మట్టిని, దానితో పాటు తన నుదుటి వెంట్రుకలను ఇచ్చి పంపిస్తూ "తన ఆధీనములో ఉన్న యమన్ దేశాన్ని, తన తలను రాజుగారి చరణాలలో అర్పించుకుంటున్నట్లు" తెలిపి ప్రాధేయపడ్డాడు. ముసలి కన్నీరు కార్చాడు. రాజు గారు మన్నించి తన జుట్టు పట్టుకొని ఈడుస్తానన్న తమ వచనాన్ని ఈ వెంట్రుకలను ఈడ్చి నిలబెట్టుకొని, అతడ్ని మాత్రం క్షమించమని అర్థించాడు. చివరికి నజాషీ ప్రసన్నుడై అతడ్ని క్షమించాడు, యమన్‌ను అతడ్నే పరిపాలించమని ఆదేశించాడు. అబ్రహ రాజును మరింత ప్రసన్నుడిని చేయాలని మరో లేఖ వ్రాసి, రాజుగారి కీర్తి నలుమూలలా వ్యాపించేలా అక్కడ ఒక ఆలయాన్ని ఎవ్వరూ నిర్మించని రీతిలో నిర్మించి, ప్రపంచ నలుమూలల నుండి కాబాకు వచ్చే జనాన్ని ఇకపై ఆ ఆలయానికి వచ్చేట్లు చేస్తానని అన్నాడు. లేఖలో వ్రాసినట్లే "సన్ఆ" అనే ప్రాంతంలో ఒక పెద్ద ఆలయాన్ని నిర్మించడం ఆరంభించాడు. చాలా ఎత్తైన, పటిష్టమైన, అందమైన భవనాన్ని నిర్మించాడు, మణిమాణిక్యాలతో దాన్ని అలంకరించాడు, ప్రజలు దాన్ని చూసేందుకు వచ్చి ఆశ్చర్యపోయేవారు. అందరూ దాన్ని "కుల్లైస్" అనడం ఆరంభించారు. ఎందుకంటే వారు దాన్ని తలెత్తి చూడాలని ప్రయత్నించిన ప్రతీసారి వారు ధరించిన టోపీలు క్రింద పడిపోయేవి కాని ఆ భవనము యొక్క పై భాగాన్ని మాత్రం ఎవరూ చూడలేకపోయారు. ఒక రోజు అబ్రహ "మక్కా నగరానికి వెళ్ళి హజ్ చేసేవారందరూ ఇకపై యమన్‌కు వచ్చి ఈ ఆలయాన్ని ప్రదక్షించాలని, ఇకపై దీన్నే కాబాగా భావించాలని" తన రాజ్యంలో ప్రకటన చేయించాడు. అరబ్ కు చెందిన అద్నాన్ మరియు కహ్తాన్ అనే రెండు జాతుల వారు దీనిపై తమ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అటు ఖురైషీల రక్తం ఉడికిపోయింది. అసలు దాని సంగతేమిటో చూడాలని నిర్ణయించుకొని కొందరు అక్కడికి చేరుకున్నారు. ఒక రాత్రి అందులో ప్రవేశించి మలమూత్ర విసర్జనలతో తమ ఆగ్రహాన్ని చాటారు. ఇది చూసిన భటులు అబ్రహకు సమాచారం అందించారు. పవిత్రమైన కాబాకు పోటీగా దీన్ని నిర్మించి, కాబాలా దీన్ని పవిత్రంగా భావించమని ఆదేశించినందుకు ఖురైష్ సంతతికి చెందిన కొందరు ఇలా తమ ఆగ్రహాన్ని వ్యక్త పరిచారు అని అతడికి చెప్పారు. క్రోధంలో మతికోల్పోయిన అతడు పవిత్ర కాబాను నేలమట్టం చేయాలని నిర్ణయించుకున్నాడు. ముకాతిల్ ఇబ్నె సులైమాన్ కధనం ప్రకారం ఖురైష్‌కు చెందిన కొందరు యువకులు అందులో నిప్పు పెట్టారు, తీవ్రమైన గాలి వీచడం వల్ల అది ఆ భవనమంతటా వ్యాపించింది, పెద్ద పెద్ద మొద్దుల ఆధారంగా నిలబెట్టిన ఆ భవనము నిప్పులో మాడి మసై ఆకాశాలలో ఉన్న దాని పైకప్పు నేలను తాకింది. ఇక అబ్రహ క్రోధం కట్టలు తెంచుకుంది. ఎవ్వరూ తనను అడ్డుకునేందుకు సాహసించకూడదని ఓ పెద్ద సైన్యాన్ని తన వెంట తీసుకొని మక్కాకు బయలుదేరాడు. పవిత్ర కాబా యొక్క స్థూపాలకు (పిల్లర్‌లకు) గొలుసులు కట్టి ఏనుగులతో లాగి దాన్ని పడగొట్టాలని ఎన్నో ఏనుగులను కూడా తన వెంట

తీసుకెళ్ళాడు. (వాటి సంఖ్య కచ్చితంగా తెలియదు. కొందరు 80 అని, కొందరు 12 అని, మరికొందరు వేరే సంఖ్యను తెలిపారు. కాని వాస్తవంగా అవి ఎన్ని ఉన్నాయో అల్లాహ్ కే తెలుసు). నజాషీ తన రాజ్యం లోనే అతి పెద్ద ఏనుగును (దాని పేరు మహ్మూద్ అని కొన్ని ఉల్లేఖనాల ఆధారంగా తెలుస్తుంది) అతడికి ఇచ్చి పంపాడు.

అబ్రహ బయలుదేరిన విషయం తెలిసిన తరువాత అరబులు ఎదురు దాడికి సిద్ధపడ్డారు. ఏదేమైనా సరే పవిత్ర కాబాను కాపాడుకోవడం తమ ధర్మమని, అతడ్ని అడ్డుకొని తీరాలని అనుకున్నారు. జూ నఫర్ అనే ఓ యమనీయుడు తమ సంతతివారిని, అరబీయులలో యుద్ధానికి సిద్ధపడ్డవారిని తీసుకొని అబ్రహను అడ్డుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అబ్రహ అతడ్ని బంధీగా చేసుకొని ముందుకు సాగాడు. "ఖస్అమ్" అనే ప్రాంతానికి చేరుకోగా నుఫేల్ ఇబ్నే హబీబ్ అనే వ్యక్తి తన ప్రాంతీయులైన షహ్రాన్ మరియు నాహిస్ సంతతులవారి సాయంతో అబ్రహను అడ్డుకున్నాడు. కాని అల్లాహ్ నిర్ణయం ప్రకారం అతడు అపజయాన్ని చవిచూశాడు. అబ్రహ చేతికి చిక్కిపోయాడు. అబ్రహ అతడ్ని ముందు చంపాలను కున్నాడు. కాని తనకు దారి చూపేందుకు పనికొస్తాడని చంపకుండా తన వెంట తీసుకెళ్ళాడు. తాయిఫ్ నగరానికి చేరువలో ఉండగా నగరవాసులు అతడు ఎక్కడ వారి నగరములో వారు "లాత్" అనే వారి ఆరాధ్య దైవం కొరకు నిర్మించిన ఆలయాన్ని ధ్వంశం చేస్తాడోనని భయపడి అతడు నగరానికి చేరుకోకముందే వారు అతడి వద్దకు వెళ్ళి మేము నీ జోలికి రాము, నీవు కూడా మా ఆలయం జోలికి రాకూడదు అని అతడితో ఒప్పందము కుదుర్చుకున్నారు. అబుర్గాల్ అనే వ్యక్తిని అతడికి దారి చూపేందుకు తోడు పంపించారు. చివరికి మక్కా నగరానికి దగ్గిరలో "ముగమ్మిస్" అని ప్రాంతానికి చేరుకొని అక్కడే పడావు వేశాడు. మక్కావాసుల పంటపొలాలు నాశనం చేయమని తన సైనికులను అస్వద్ ఇబ్నె మఖ్సూద్ నేతృత్వంలో పంపాడు. వారు అక్కడ కల్లోలం సృష్టించారు. అక్కడే సంచరిస్తున్న వారి ఒంటెలు మొదలైన వాటిని అపహరించుకున్నారు. అందులో మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి తాతగారైన హ్జ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ గారి 200 ఒంటెలను కూడా అపహరించుకుపోయారు. ఆ తరువాత హునాతహ్ అల్ హుమ్యరీ అన్ వ్యక్తిని పంపి ఖురైష్ సంతతికి చెందిన నాయకులను తీసుకురమ్మని, "మా దారికి అడ్డొచ్చిన వారిని తప్ప ఇంకెవ్వరిని చంపే ఆలోచన మాకు లేదు, మేమొచ్చిన పనిని ముగించుకొని వెళ్ళిపోతాము" అని కూడా వారికి చెప్పమని కూడా ఆదేశించాడు. హునాతహ్ మక్కా చేరుకొని ఖురైష్ నాయకుల గురించి అడగ్గా అతడ్ని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి తాతగారి వద్దకు తీసుకెళ్ళారు. అతడు చెప్పాల్సిందంతా చెప్పిన తరువాత హ్జ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ గారు ఇలా అన్నారు: "మాకు కూడా అబ్రహను అడ్డుకునే అభిప్రాయము లేదు, వాడ్ని అడ్డుకునే శక్తి కూడా మాకు లేదు. ఇది అల్లాహ్ యొక్క పవిత్ర గృహము, అతడి ఖలీల్ హ్జ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ గారి గృహము, వారి గృహము కాబట్టి వారు అడ్డుకోవాలనుకుంటే అడ్డుకుంటారు లేకపోతే లేదు. వారి తరపున మిమ్మల్ని అడ్డుకునే శక్తి అయితే మాకు లేదు". ఇది విన్న హునాతహ్ వారిని తమ వెంట రమ్మని కోరాడు. వారు నిరాకరించకుండా అతడి వెంట వెళ్ళారు. అబ్రహ దూరం నుండి వారి ముఖ తేజస్సు, సౌందర్యాన్ని

చూసి అవాకయ్యాడు. వారిని సగౌరవంగా ఆహ్వానిస్తూ తమ సింహాసనం నుండి దిగివచ్చాడు. వారితోనే తివాచీ (కార్పెట్) పై కూర్చున్నాడు. వారికి ఏమి కావాలో అడగమని అనువాదకుడికి ఆదేశించాడు. వారు మీ రాజు గారి స్వాధీనములో ఉన్న నా ఒంటెలను నాకు తిరిగి ఇమ్మని అడగండి అని అన్నారు. అది విన్న అబ్రహ ఇలా అన్నాడు: "మిమల్ని చూసిన వెంటనే నాకు మీ గురించి మంచి అభిప్రాయము కలిగింది, కాని ఇప్పుడు అది లేదు. నేను మీ, మీ పూర్వీకుల ధర్మము యొక్క భాగమైన కాబాను కూల్చడానికి వస్తే, దాని గురించి మాట్లాడ కుండా అవివేకుల్లా మీ ఒంటెల గురించి మాట్లాడతారా? మీకు మీ ధర్మము కన్నా మీ ఒంటెలే ఎక్కువా? దానికి వారు ఇలా అన్నారు: ఒంటెలు నావి కాబట్టి నేను వాటి గురించి చింతిస్తున్నాను. ఆ ఇల్లు అల్లాహ్‌ది, దాని గురించి నేనెందుకు చింతిస్తాను. కావాలనుకుంటే ఆయనే దాన్ని కాపాడుకుంటాడు. ఆశించని విధంగా ఇచ్చిన ఈ జవాబుకు అతడు కూడా ఆశ్చర్య పోయాడు. అల్లాహ్ కూడా నన్ను ఆపలేడు అని అహంకారముతో అన్నాడు. కాని హజ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ గారు మాత్రం అది మీ ఇద్దరి సమస్య అంటూ వెళ్ళిపోయారు.

కొన్ని ఉల్లేఖనాల ఆధారంగా హజ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ గారితోపాటు మరికొందరు ఖురైషీలు అబ్రహ వద్దకు వచ్చి కాబాను ధ్వంశం చేయకుండా విడిచిపెడితే ప్రతి ఏట వారి పంట నుండి మూడవ భాగం (1/3) వాడికి సమర్పించుకుంటామని ఒప్పందము వాడి ముందు ఉంచగా వాడు తిరస్కరించినట్లు తెలుస్తుంది. అలాగే వాడు హజ్రత్ అబ్దుల్ ముత్తలిమ్ గారి ఒంటెలను తిరిగిచ్చేసినట్లు కూడా తెలుస్తుంది.

ఆ తరువాత హజ్రత్ అబ్దుల్ ముత్తలిబ్ గారు మక్కాకు తిరిగి వచ్చి మక్కాను ఖాళీ చేసి అందరూ వెళ్ళి కొండలలో దాక్కోవాలని ఆదేశించారు. ఆ తరువాత వారు మరికొందరిని తీసుకొని కాబా ద్వారాన్ని పట్టుకొని అల్లాహ్‌ను ప్రార్థించారు. వారు ఇలా అన్నారు:

لاهُمَّ إنَّ المرء يمـــ ... نعُ رَحْلَه فامْنع حِلالَك ...

لَا يغلبنَّ صَلِيبُهم ... ومحَالُهم غدْوًا مِحَالك ...

మేము నిశ్చింతగా ఉన్నాము, ఎందుకంటే ప్రతి ఇంటి వాడు తన ఇంటిని రక్షించుకుంటాడు ఓ అల్లాహ్ నీ ఇంటిని ఈ రాక్షసుల నుండి రక్షించు. వీరి సిలువలు, వీరి శూలాలు నీ ఇంటిని ఏమీ చేయలేవు.

మరుసటి రోజు అబ్రహ మక్కాలోకి ప్రవేశించాలని నిర్ణయించుకున్నాడు. అతడి ఏనుగును సిద్ధం చేశాడు. సైన్యాన్ని ఆదేశించాడు. అతడి ఏనుగును మక్కా వైపుకు తిప్పగా నుఫైల్ ఇబ్నే హబీబ్ దాని ప్రక్కన నిలబడి దాని చెవును పట్టుకొని "క్షేమంగా వెనక్కి వెళ్ళాలంటే ఇక్కడే ఆగిపో, నువ్వు పవిత్ర మక్కాలో కాబాను ధ్వంశం చేయడానికి అడుగుపెట్టబోతున్నావు." అని అన్నారు. ఆ ఏనుగు వెంటనే కూర్చుంది, దాన్ని ఎంత కొట్టినా లేవలేదు. రకరకాలుగా ప్రయత్నించారు, కాపర్లు,

భటులు అందరూ తమ వంతు కృషి చేశారు కాని ఫలితమేమీ రాలేదు. సైనికులు దాన్ని లేపే ప్రయత్నంలో నిమగ్నమై ఉండగా నుఫేల్ ఇబ్నే హబీబ్ తప్పించుకొని కొండల వైపుకు పారిపోయాడు. చివరికి వారు అలసిపోయి దాని ముఖాన్ని యమన్ వైపుకు తిప్పగా అది లేచి పరిగెత్తడం ఆరంభించింది. మళ్ళీ మక్కా వైపుకు మల్లించగా తిరిగి కూర్చుంది. మరలా దాని ముఖాన్ని షామ్ వైపుకు తిప్పగా లేచి నిలబడిపోయింది. అలా మక్కాకు వ్యతిరేక దిశలో దాన్ని మరల్చగా లేచి నిలబడేందుకు సిద్ధమయ్యేది. కాని మక్కా దిశకు మరల్చిన వెంటనే కూర్చునేది.

ఇంతలోనే అల్లాహ్ తఆలా సముద్రము వైవునుండి ఖతాతీఫ్ మరియు బలసాన్ వంటి చిన్న చిన్న పక్షులను పంపించారు. ప్రతి పక్షి వద్ద బటానీలు లాంటి చిన్న చిన్న మూడు రాళ్ళు ఒకటి నోట్లో, రెండు కాళ్ళలో ఉండేవి. ఆ రాళ్ళు ఎవరిపై వచ్చి పడతాయో వారు ఆక్కడికక్కడే ప్రాణాలు విడిచేవారు. కొంత మందికి రాళ్ళు తగలలేదు. వారు అక్కడ నుండి పారిపోయేందుకు ప్రయత్నించారు. దారి తెలియక ముప్పతిప్పలు పడ్డారు. దారి తెలిసిన నుఫేల్ ఎక్కడ నుఫేల్ ఎక్కడ అని ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. కాని నుఫేల్ మాత్రం ఖురేషీలతో కలసి కొండపై నుండి దర్జాగా మొత్తం దృశ్యాన్ని చూస్తూ వారిని సంబోధిస్తూ ఈ కవితలను చదువుతున్నాడు:

أينَ المَفَرُّ والإلهُ الطَّالب والأشرمُ المغلوبُ غَيْرُ الْغَالِبْ

ఎక్కడికి పరిగెడతారు??? మిమ్మల్ని అల్లాహ్ వెంటాడుతున్నాడు.
జయించాలని వచ్చిన మూర్ఖులు అపజయాన్ని రుచిచూశారు.

హ॥జత్ అతా ఇబ్నె యసార్ ఉల్లేఖనం ప్రకారం కొంత మందికి ఆ రాళ్ళు తగిలినప్పటికీ వారి అకడికక్కడే మరణించలేదు. వారి అవయవాలు ఒకటి తరువాత ఒకటి కుళ్ళిపోతూ చాలా అవస్థలకు గురై దారిలో చనిపోయారు. అ॥బ్రహకు కూడా ఇదే గతి పట్టింది. అతడు ఖస్అమ్ అను ప్రాంతం వరకు ఇలాగే అవస్థలు పడుతూ చివరికి కుక్కచావు చచ్చాడు.

ఈ వృత్తాంతాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు సూరే ఫీల్ యొక్క భావం మరియు ఈ సూరా అందించే సందేశం ఏమిటో చూద్దాం.

మక్కా వాసులపై అల్లాహ్ యొక్క ఉపకారాలు, అనుగ్రహాలు ఎన్నో ఉన్నాయి. కాని వాటన్నిటిని మరచి వారు అల్లాహ్ పట్ల అవిశ్వాసము చూపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని తిరస్కరించారు. వారికి ఎన్నో ఇబ్బందులు, ఆటంకాలు కలుగజేశారు. చివరికి వార్ని చంపాలని కూడా పన్నాగాలు వేశారు. అల్లాహ్ తఆలా ఇటువంటి అవిధేయులకు, కాఫిర్లకు వారి ప్రదేశంలో, వారి కళ్ళ ముందు జరిగిన ఒక యదార్థ వృత్తాంతమును గుర్తుచేయిస్తూ వారిని హెచ్చరించారు. అవిధేయత యొక్క ప్రతిఫలం ఏమిటో అది ఎంత దారుణంగా ఉంటుందో మీకు తెలియనిదేమీ కాదు. అయినప్పటికీ అదే మార్గంలో మీరు ఎందుకు పోతున్నారు? అలాంటి పరిణామాలను మరోసారి చూడాలని, అల్లాహ్ ఆగ్రహము యొక్క రుచి చూడాలని మీరు కోరుకుంటున్నారా? అని వార్ని ఒకవైపు మందలిస్తూనే మరోవైపు దైవ ప్రవక్త హ॥జత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి ధైర్యం చెప్పారు. కాఫిర్లు, అవిశ్వాసులు పూర్వం ఎన్నో సార్లు ఇలాంటి ప్రయత్నాలు

చేశారు, వారి బలం, బలగం మొత్తం ప్రయోగించి అల్లాహ్‌కు వ్యతిరేకంగా పోరాడాలనుకున్నారు. కాని వారిని అల్లాహ్ క్షణాలలో మట్టికర్పించాడు. ఓ ప్రవక్తా ! “ఏనుగులతో వచ్చిన వారితో అల్లాహ్ ఏలా డీల్ చేశాడో మీకు తెలియదా?” వారు ఏదేదో చేసేయాలని ప్లాన్‌తో వచ్చారు, బలం బలగం వెంటేసుకొచ్చారు. కాని అల్లాహ్ “వారి ప్లాన్‌లను వారి యత్నాలను వమ్ము చేయలేదా?” వారు ఏనుగులు, ఆయుధాలు, సైనికులతో వచ్చి అల్లాహ్‌కు ఎదురు నిలుద్దాం అని అనుకున్నారు. మరి అల్లాహ్ ఏం చేశాడు. వారిలా పెద్ద సైన్యాన్ని రంగంలోకి దించాడా? లేదు... వారిని మట్టికర్పించడానికి “కొన్ని చిన్ని చిన్ని పక్షుల గుంపులను పంపించాడు” అవి ఎం చేశాయి? అల్లాహ్ ఆజ్ఞతో “వారిపై కంకర రాళ్ళు విసిరాయి” అంతే ఆ దెబ్బకి వారందరూ “పశువులు తిని ఆగం చేసిన మేతలా అయిపోయారు”.

సందేశం:

ఈ సూరాలో అల్లాహ్ విధేయులకు, అవిధేయులకు ఇద్దరికీ సందేశం ఉంది. అలాహ్‌ను విశ్వసించి వారికి విధేయత చూపినవారు ఎవ్వరికీ భయపడనఖ్ఖరలేదు. వారికి వ్యతిరేకంగా ఎన్ని పన్నాగాలు పన్నినా, వారిని నాశనం చేయలని ఎన్ని ప్రయాసాలు చేసుకున్నా వారికి అండగా అల్లాహ్ ఉన్నాడు. వారు ఊహించని విధంగా వారిని రక్షిస్తాడు.

అలాగే అవిధేయులు వారికి అల్లాహ్ అనుగ్రహించిన వివేకాన్ని, బుద్ధిని కాస్త వాడాలి. వారి నలువైపులా వారు చూస్తున్న ఈ ప్రపంచంలోని అంణువణువు అల్లాహ్ ఉనికిని, గొప్పతనాన్ని, శక్తిని చాటిచెబుతుంది. కొంచం మదడు పెట్టి ఆలోచించి అల్లాహ్ యొక్క అస్తిత్వాన్ని, వారి శక్తిని గ్రహించి అల్లాహ్‌ను విశ్వసించి విధేయులుగా మారాలి. అలా కాకుండా అల్లాహ్ అనుగ్రహించిన సంపద, బలం, బలగాన్ని చూసుకొని అహంకారం, గర్వంతో రెచ్చిపోయి అల్లాహ్‌కు అవిధేయత చూపితే అల్లాహ్‌కు వారి అహంకారాన్ని మట్టికర్పించడానికి కొన్ని క్షణాలు కూడా పట్టవు. దీనికి చరిత్రే సాక్ష్యం.

ప్ర: వ్యాపారంలో వృద్ధి కోసం ఏదైనా వజీఫా చెప్పండి.

జ: హజ్రత్ జుబేర్ ఇబ్నె ముత్ఇమ్ ర.జి గారి కథనం ప్రకారం ప్రవక్త (స) గారు వార్ని “వ్యాపార రిత్యా నీవు ప్రయాణం చేసినప్పుడి నీ స్నేహితుల కన్నా మంచి లాభాలతో తిరిగి రావాలని నువ్వు కోరుకుంటున్నావా?” అని ప్రశ్నించాగా వారు అవును అని సమాధానం ఇచ్చారు. దానికి ప్రవక్త (స) గారు దివ్య ఖుర్ఆన్ చివర్లో ఉన్న 5 సూరాలు సూరే కాఫిరూన్ (ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్), సూరే నస్ర్ (ఇజా జాఅ నస్‌రుల్లాహి), సూరే ఇఖ్లాస్ (ఖుల్ హువల్లాహు అహద్), సూరే ఫలఖ్ (ఖుల్ అఊజు బిరబ్బిల్ ఫలఖ్) మరియు సూరే నాస్ (ఖుల్ అఊజు బిరబ్బిన్ నాస్) చదువమని, ప్రతీ సూరాను బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ తో ఆరంభించు దానితోనే ముగించు అని అన్నారు. దీనిపై అమలు చేసిన తరువాత వారి వ్యాపారంలో వారు ఎంతో వృద్ధిని కళ్ళారా చూసినట్లు తెలిపారు. – (తఫ్సీరే కుర్తుబీ, ముస్నదే అబూయాలా)

"కారుణ్యమూర్తి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా ఉపదేశించారని హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: దానశీలి అయిన దైవదాసుడు అల్లాహ్‌కు అత్యంత సమీపంగా ఉంటాడు, దైవదాసులకు సమీపంగా ఉంటాడు. ఇంకా అతడు స్వర్గానికి చేరువగా, నరకానికి దూరంగా ఉంటాడు. లోభి, పిసినారి దైవానికి దూరంగా ఉంటాడు. అంటే దైవ సామీప్య భాగ్యానికి నోచుకోడు. దైవ దాసులకు కూడా దూరంగానే ఉంటాడు. ఇంకా అతను స్వర్గానికి దూరంగా, నరకానికి చేరువగా ఉంటాడు. నిస్సందేహంగా ఒక అజ్ఞాని అయిన దానశీల, అధికంగా దైవారాధన చేసే పిసినారి దాసునికన్నా దైవానికి ఎంతో ప్రియమైనవాడు."

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు గారు ఉల్లేఖించారు: "మీరు ఇతరుల కోసం ఖర్చుపెడుతూ ఉండండి. నేను మీ కోసం ఖర్చుపెడుతూ ఉంటాను" అని అల్లాహ్ తఆలా తన దాసులకు ఉపదేశించాడు. (బుఖారీ, ముస్లిం)

సంగ్రహణం:

అంటే ఏ దాసులైతే తమ శ్రమను, తమ సంపదను ఇతరుల అవసరాలు తీర్చడానికి వెచ్చిస్తారో, వారికి అల్లాహ్ తన గుప్త నిధి నుండి నిరంతరంగా ప్రసాదిస్తూనే ఉంటాడు. వారు బీదరికం నుండి, బాధలనుండి రక్షింపబడుతూ ఉంటారని అర్థం.

"దైవప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లమ్ గారిని ఏదైనా వస్తువు అడిగినప్పుడు ఆయన "లేదు" అని అనడం ఏనాడూ జరుగలేదు" అని హజ్రత్ జాఫర్ రజియల్లాహు అన్హు తెలియజేశారు.

సంగ్రహణం:

అంటే, దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి దాతృత్వ పరిస్థితి ఎలా ఉండేదంటే, ఏనాడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లమ్) యాచకునికి "లేదు" అని వెనక్కి పంపించలేదు. అడిగిన ప్రతి ఒక్కనికి ఎప్పుడూ ఇచ్చే పంపేవారు. ఒక్కోసారి ఆయన వద్ద లేకపోతే ఇతరులనైనా అడిగి ఇప్పించేవారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు గారు ఉల్లేఖించారు: "ఒకవేళ నా దగ్గర ఉహద్ పర్వతమంత బంగారమున్నా, ఏదైనా అప్పు తీర్చడానికి అందులో కొంత ఉంచుకోవడం తప్ప అది నావద్ద కనీసం మూడు రాత్రుల వరకు ఉండడానికి కూడా నేను ఇష్టపడను. (బుఖారీ, ముస్లిం)

హ|జత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా ఉపదేశించారు:

"అత్యాస, లోభత్వం మరియు ఈమాన్ ఒకే హృదయంలో ఎప్పుడూ కలిసి ఉండజాలవు."

సంగ్రహణం: అంటే, వాస్తవ విశ్వాసం మరియు పిసినారి అలవాట్ల మధ్య భూమ్యాకాశాల తేడా ఉంది. ఏ హృదయానికైతే వాస్తవ విశ్వాస భాగ్యం ప్రాప్తమవుతుందో అందులో లోభితనం ప్రవేశించలేదు. అలాగే ఏ హృదయమైతే లోభత్వానికి గురై ఉంటుందో ఆ హృదయంలో ఈమాన్ వెలుగు ఉండదు.

దేవుని అస్తిత్వం, ఆయన గుణగణాల పట్ల సంపూర్ణ విశ్వాసం ఉన్న హృదయంలో పిసినారితనం, లోభత్వ గుణాలకు లేశమంత అవకాశం కూడా ఉండదన్నమాట.

హ|జత్ అబూబక్ర్ సిద్దీఖ్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా ఉపదేశించారు:

"వంచకుడు, లోభి, మేలు చేసి దెప్పి పొడిచేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు." (తిర్మిజీ)

సంగ్రహణం: ఈ మూడు ఎంతటి భయంకరమైన దుర్గుణాలంటే, అవి స్వర్గ మార్గానికి ఆటంకాలుగా నిలుస్తాయి. కనుక స్వర్గాన్ని కాంక్షించేవారు ఈ మూడు అలవాట్ల నుండి తమను తాము కాపాడుకోవాలి.

ప: భార్యా, పిల్లలతో చాలా ఇబ్బందులు ఎదురుకుంటున్నాను. కొన్ని సార్లు సన్యాసం పుచ్చుకుందాం అని అనుకుంటాను. ఏదైనా దువా ఉంటే చెప్పండి?

జ: మంచి ఇల్లాలు, మంచి సంతానము ఒక వరం. స్వయంగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు మంచి ఇల్లాలు, మంచి సంతానము కోసం అనునిత్యం ఈ దువా చేసేవారు:

اللَّهُمَّ إِنِّي أَعُوذُ بِكَ مِنْ جَارِ السُّوءِ، وَمِنْ زَوْجٍ تُشَيِّبُنِي قَبْلَ الْمَشِيبِ،

وَمِنْ وَلَدٍ يَكُونُ عَلَيَّ رِبًا، وَمِنْ مَالٍ يَكُونُ عَلَيَّ عَذَابًا، وَمِنْ خَلِيلٍ مَاكِرٍ

عَيْنَهُ تَرَانِي وَقَلْبُهُ تَرْعَانِي إِنْ رَأَى حَسَنَةً دَفَنَهَا، وَإِذَا رَأَى سَيِّئَةً أَذَاعَهَا

అల్లాహుమ్మ ఇన్నీ అఊజుబిక మిన్ జారిస్సూ, వ మిన్ జౌజిన్ తుషయ్యిబునీ కొబ్‌ల మషీబీ, వ మిన్ వలదిన్ యకూను అలయ్య రబ్బా, వ మిన్ మాలిన్ యకూను అలయ్య అజాబా, వ మిన్ ఖలీలిన్ మాకిరిన్ అయ్‌నుహూ తరానీ వ కల్‌బుహూ తర్‌ఆనీ, ఇన్ రఆ హసనతన్ దఫనహా, వ ఇజా రఆ సయ్యిఅతన్ అజాఅహా.

(తబ్రానీ ఫిద్దువా: 1339)

నోట్: మంచి భర్త దొరకాలని స్త్రీలు, అలాగే మంచి భార్య దొరకాలని పురుషులు ఇద్దరూ ఇదే దువాను చేయగలరు. అలాగే సూరే ఫుర్ఖాన్ 74వ వచనంలో ఉన్న దుఆను కూడా చేయగలరు.

భారత స్వాతంత్ర్యోద్యమం-ముస్లిం

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక మహోజ్జ్వల ఘట్టం. భారతీయుల పోరాటపటిమకు, త్యాగనిరతికి, నిరుపమాన దేశభక్తికి ఆ ఉద్యమం ఒక నిలువుటద్దం. దాదాపు ఒక శతాబ్దంపైగా సాగిన ఈ పోరాటాన్ని సుసంపన్నం చేసేందుకు జాతి, కుల, మత, ప్రాంతీయతలను విస్మరించి భారతీయులంతా ఏకోన్ముఖంగా ఆత్మార్పణలకు పోటీపడటం అపూర్వం. లక్షలాది ప్రజానీకం ఒకే నినాదం, ఒకే లక్ష్యం కోసం ఒకే బాటన ముందుకు సాగడం ప్రపంచ చరిత్రలోనే అరుదైన సంఘటన.

ఈ పోరాటానికి భారతదేశపు అతి పెద్ద పెద్ద అల్పసంఖ్యాక వర్గమైన ముస్లిం సమాజం తనదైన భాగస్వామ్యాన్ని అందించింది. ముస్లిమేతర సాంఘీన జనసమూహాలతో మమేకమై స్వాతంత్ర్యసమరంలో తన విధ్యక్త ధర్మాన్ని నిర్వర్తించింది. ఆ అపూర్వ త్యాగాలతో, అసమాన ఆత్మబలిదానాలతో భారతీయ ముస్లింలు పునీతులయ్యారు. అయినప్పటికీ ముస్లిం సమాజం త్యాగమయ చరిత్ర పలుకారణాల మూలంగా మరుగున పడిపోయింది. తమ పాలకఖిదనను సుస్థిరం చేసుకునేందుకుగాను బ్రిటీష్ పాలకులు "విభజించు-పాలించు" కుటిల నీతిని అమలుపర్చి భారతీయులను హిందువులు-ముస్లింలుగా విభజించటంలో కృతకృత్యులయ్యారు. భారత విభజనకు దారితీసిన పరిస్థితులు, ఆ తరువాత జరిగిన దారుణాలు, పొరుగుదేశంగా ఏర్పడిన పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధాలు, వివాదాలు స్వాతంత్ర్యోద్యమ కాలంనాటి హిందూ-ముస్లిం ఐక్యతకు చిచ్చుపెట్టాయి. భారత విభజనాంతర పరిణామాల వలన అపరాధ భావనకు గురిచేయబడిన ముస్లిం సమాజం సుషుప్తావస్థలోకి నిష్క్రమించింది. యుద్ధాలు, వివాదాలు, దేశంలో తరచుగా సాగిన మతకలహాలు, మెజారిటీ, మైనారిటీ వర్గాల మధ్య మానసిక విభజనకు కారణ మయ్యాయి.

ప్రజల మత మనోభావాలను రెచ్చగొట్టి మతం పేరుతో మనుషులను చీల్చి, రాజకీయ ప్రయోజనాలను సాధించదలచిన మతోన్మాద రాజకీయ శక్తులు, వ్యక్తులు ఈ చీలికను అగాధంగా మార్చాయి. పర్యవసానంగా బ్రిటీషర్ల బానిసత్వం నుండి మాతృ భూమిని విముక్తం చేసేందుకు సాగిన సుదీర్ఘ పోరాట చరిత్రలో ముస్లిం సమాజం త్యాగాలు మరుగునపడిపోయాయి.

చరిత్ర గ్రంథాలలో ముస్లింలు చాలావరకు కనిపించరు. ఒకరిద్దరు కనిపించినా అనన్య సామాన్యమైన వారి త్యాగాలు, సాధారణ స్థాయి వివరణలతో, వర్ణనలతో సరిపెట్టబడతాయి. ప్రాచుర్యంలో ఉన్న చరిత్ర గ్రంథాలలో ముస్లింల వీరోచిత గాథలు సరైన స్థానం పొందలేకపోయాయి. కనుక ఆయా కథనాలు సామాన్య చరిత్ర గ్రంథాలలోగాని, పాఠ్య పుస్తకాలలోగాని చోటు చేసుకోలేదు. ఫలితంగా భవిష్య తరాలకు అమూల్య సమాచారం అందకుండా పోయింది.

చరిత్ర ద్వారా తెలిగ్గా సమాచారం లభించే అవకాశం లేనందున, కళారూపాలకు, సాహిత్య ప్రక్రియలకు, ప్రచారమాధ్యమాలకు ముస్లింల శ్లాఘనీయ చరిత్రలు కథా వస్తువు కాలేకపోయాయి. ఆ కారణంగా ముస్లింల త్యాగాలు, ఆనాటి వీరోచిత సంఘటనలు జనబాహుళ్యంలోకి వెళ్ళకపోవటంతో ఆ తరువాత తరాలకు ఆ విషయాలు అందలేదు. ఈ పరిణామాలే భారతదేశంలోని హిందూ - ముస్లిం జనసమూహాల మధ్య మానసిక ఎడం ఏర్పడటానికి కారణమయ్యాయి.

ఈ మానసిక అగాథాన్ని మరింత పెంచి ఒక సాంఘిక జనసమూహానికి తామే ఏకైక ప్రతినిధులుగా ప్రకటించుకుని రాజ్యమేలాలని ఆశిస్తున్న శక్తులు–వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు.

ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఎంతో ఉంది. ప్రజలకు అన్ని సాంఘిక జనసముదాయాల త్యాగాలు తెలియాల్సి ఉంది. పలు సాంఘిక జనసముదాయాల గడ్డ అయినటువంటి భరతభూమిలో ఆయా జనసముదాయాల మధ్యన సుహృద్భావ వాతావరణం ఏర్పడడానికి ఒకరి గురించి మరొకరికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాతృభూమి సేవలో పునీతమైన ప్రజలందరి చరిత్ర తెలిసినప్పుడు మాత్రమే ఆయా జనసముదాయాల మధ్యన పరస్పర గౌరవం ఏర్పడుతుంది. ఆ గౌరవం సదవగాహన, సద్భావన, సహిష్ణుతకు పునాది అవుతుంది.

ఈ వాతావరణంలో మాత్రమే లౌకిక వ్యవస్థ పరిఢవిల్లుతుంది. మత విద్వేషాలు మట్టిలో కలసి మతసామరస్యం మరింతగా పటిష్టమౌతుంది. ఆ ప్రయత్నంలో భాగంగా సామాన్య ప్రజలకు చేరువకాని ముస్లింల త్యాగమయ చరిత్రను ప్రజల చెంతకు చేర్చేందుకు ప్రముఖ జర్నలిష్ట్ సయ్యద్ నసీర్ అహ్మద్ గారు నడుంబిగించారు. (కష్మీర్ మినహాయించి) దేశమంతటా పర్యటించి, చరిత్ర పరిశోధకుల, చరిత్ర అధ్యాయ సంస్థల తలుపు తట్టి, చారిత్రక స్థలాలను దర్శించి, ప్రసిద్ధ గ్రంథాలయాలన్నిటినీ సందర్శించి ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ భాషలలో ఉన్న చారిత్రిక గ్రంథాలన్నిటినీ చదివి, పర్శీలించి, అలాగే సజీవంగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధులు లేదా వారి సన్నిహితులను నేరుగా కలిసి, వారి నుండి ఎంతో విలువైన సమాచారాన్ని, ఆనాటి లేఖలు, ఫొటోలను సేఖరించి ఇవాల్టి వరకు వెలుగు చూడని ముస్లిం యోధుల త్యాగాలు, వారు నడిపిన ఉద్యమాల వివరాలు అన్నిటినీ బలమైన ఆధారాలతో సహా ప్రచురించారు, ప్రచురిస్తున్నారు. 15 సంవత్సరాలుగా వారు చేస్తున్న ఈ నిస్వార్థ కృషికి ఫలితంగా ఇప్పటివరకు భారత స్వాతంత్యోద్యమంలో ముస్లింల పాత్రను తెలుపుతూ 11 పుస్తకాలు వెలువడ్డాయి. ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులైన ఆచార్య అడపా సత్యన్నారాయణ గారు "ప్రముఖ ఆంధ్రప్రదేశ్ చరిత్రకారులు ఆచార్యులు మామిడి పూడి వెంకట రంగయ్య, సరోజిని రెగాని, బయినపల్లి కేశవ నారాతణ లాంటి వారు తమ రచనల్లో తెల్పినటువంటి అనేక విషయాల్ని, సంఘటల్ని, పోరాటయోధుల సమాచారాన్ని సేకరించి నశీర్ గారు పాఠకులకు అందించారని" అన్న మాటల ద్వారా ఈ పుస్తకాలలోని సమాచారం ఎంత అరుదైనదో, వాటిని సేకరించడానికి రచయిత ఎంతగా శ్రమించి ఉంటారో మనకు అర్థమౌతుంది. ఇలా ఎంతో అరుదైన, ప్రామాణికమైన సమాచారం (వాటిని సెకరించిన ఆధార గ్రంధాల వివరాలతో సహా) కూడి ఉండడం ఈ పుస్తకాలకున్న ఒక విశిష్టత అయితే వీటికున్న మరో గొప్ప విశిష్టతను భాషా పండితులు 'యాది' సదాశివ గారు గ్రహించి వారి మాటలలో ఈ విధంగా పేర్కొన్నారు: "అతని రచనలో ఎక్కడా పరనింద వుండదు. వ్యంగ్యం ఉండదు. పక్షపాతం ఉండదు. అతిశయోక్తి అనిపించే మాట వుండదు". నిష్పక్షపాతం, అతిశయోక్తి లేకుండా కేవలం ప్రామాణికమైన సమాచారము కలిగిఉండడం వల్ల అధికార–అనధికార ప్రముఖులు అందరూ వాటిని ఆదరించారు, చరిత్రకారులు దృవీకరించారు, పత్రకారులు చక్కని సమీక్షలతో ప్రజలకు పరిచయం చేశారు, స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్, ఆంధ్ర

ప్రదేశ్ రాష్ట్ర పూర్వ గవర్నర్ శ్రీ సూర్జిసింగ్ బర్నాలా, కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి, తదితర ప్రముఖులు, పలు విశ్వవిద్యాలయాలు-సంస్థలు వారిని, వారి కృషిని గుర్తించి అభినందించారు, ప్రశంసించారు.

ధార్మిక విషయాలను తప్ప ఎన్నడూ లౌకిక విషయాలను చర్చించని మా పత్రికలో తొలిసారిగా సయ్యద్ నసీర్ అహ్మద్, వారి పుస్తకాల గురించి వ్యాసం వ్రాయడానికి కారణమేమిటంటే ఇవాళ మన చరిత్ర మనకే తెలీదు. స్కూళ్ళలో, కాలేజీలలో ఎక్కడా ప్రస్తావించబడదు. పాఠక పుస్తకాలలో ఒకరిద్దరి తప్ప ఇంకెవ్వరి చరిత్ర మచ్చుక్కూడా కనిపించదు. ఇక మన అజ్ఞానాన్ని అవకాశంగా తీసుకొని ముస్లింలు విదేశీయులు, దేశద్రోహులు, ఇక్కడి సంస్కృతిని మంటగలిపారు, నాశనం చేయడం మినహా ఈ దేశానికి ముస్లింలు చేసిందేమీ లేదు అని కొందరు ప్రకటిస్తుంటే రాను రాను మన పిల్లలు అదే నిజమేమోనని అనుకుంటున్నారు. అందుకే ముందు మనకు మన చరిత్ర పట్ల అవగాహన కావాలి, ఆ తరువాత మన ముస్లిమేతర సోదరులకు మన దేశభక్తి గురించి అవగాహన కల్పించాలి. ఇక మన దేశభక్తిపై ప్రశ్నలు కురిపించే...నిద్రానటులకు సమాధానం అంటారా అది ఇక అక్కర లేదు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య గారు చెప్పినట్లు "...భారత స్వాతంత్ర్య సాధనలో, అభ్యుదయ పరంపరలో భాగస్వాములైన ముస్లిం వనితల చరిత్రను వెలువరించి, హిందువులమే భారత స్వాతంత్ర్యాన్ని సాధించామని, ముస్లింలకు భాగస్వామ్యం లేదని చాటే మరుగుజ్జులకు చెంపదెబ్బగా ఈ రచన శాశ్వతంగా నిలుస్తుంది.."

క్రింద సయ్యద్ నసీర్ అహ్మద్ గారి పుస్తకాల సంక్షిప్త పరిచయం మరియు వాటిపై ప్రముఖుల-పత్రికల సమీక్షల్లో నుండి ప్రధానమైన వాటిని అందించడం జరుగుతుంది.

1. భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లింలు

భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం జనసముదాయాల త్యాగాల చరిత్రను సంక్షిప్తంగా



వివరిస్తుంది. 1757 నుండి 1947 వరకు బ్రిటీష్ వ్యతిరేక పోరాటలలో భాగంగా సాగిన ప్రధాన ఘట్టాలలో ముస్లింల పాత్రకు సంబంధించిన విలువైన సమాచారాన్ని క్లుప్తంగా అందిస్తుందీ పుస్తకం.

... 1857 తిరుగుబాటు నుండి మనకు స్వాతం లభించేంతవరకు ప్రాణత్యాగాలు చేసిన ఎందరో ముస్లింలు చాలా మందికి పరిచయం లేదంటే అతిశయోక్తి లేదు. మేము నిజమైన జాతీయవాదులమని చెప్పుకునే కొందరు స్వార్థపరులు మన పొరుగున ఉన్న పాకిస్థాన్ బూచిని చూపించి భారత ముస్లింల దేశభక్తిని వేలెత్తి చూపిన సంఘటనలు కోకొల్లలు. అటువంటి స్వార్థపర శక్తుల నోటికి తాళం పడేలా ప్రముఖ జర్నలిస్ట్, రచయిత సయ్యద్ నశీర్ అహమ్మద్ 'భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లింలు' అను పుస్తకంలో అనేక త్యాగాల గూర్చి తెలిపారు. ముస్లింల దేశభక్తి విషయంలో జరుగుతున్న అసత్య ప్రచారాలు ఇటువంటి పుస్తకాలు అరికట్టగలవనడంలో అతిశయోక్తి లేదు.

-వార్త దినపత్రిక, 07-11-1999

2. మైసూరు పులి: టిప్పూ సుల్తాన్



బ్రిటీష్ పాలకుల సామ్రాజ్యవిస్తరణ కాంక్షను ఆదిలోనే గ్రహించి స్వదేశీ పాలకులను హెచ్చరించడమే కాకుండా, చరమాంకం వరకు పరాయి పాలకులతో పోరాడిన జాతీయవాది, మైసూరు పులిగా ఖ్యాతిగాంచిన టిప్పూ సుల్తాన్ జీవిత చరిత్రను విలువైన చిత్రాలు, ఫోటోలతో ఆవిష్కరిస్తుంది పుస్తకం.

“ఈ పుస్తక రచన చాలా పరిశోధనాత్మకంగా సాగింది. పుస్తకం పేజీల లెక్కన చూస్తే చిన్నదే అయినా, అంశాన్ని బట్టి బేరీజు వేస్తే “పిట్ట కొంచెం కూత ఘనం” అనక తప్పదు.... చారిత్రిక వ్యక్తుల ఆవిష్కరణలో రచయిత చక్కని సమతౌల్యం, నిజాయితీ పాటించారు.”

– ఎడిటర్, వారపత్రిక , 14–20 ఆగష్టు 2002

3. షహీద్–యే–ఆజం అష్ఫాఖుల్లాహ్ ఖాన్

సర్దార్ భగత్‌సింగ్‌కు స్ఫూర్తిగా నిలిచిన విప్లవకారుడు, స్వాతంత్ర్యోద్యమంలో సంచలనం సృష్టించిన

‘కాకోరి రైలు’ సంఘటనలో ప్రధాన పాత్ర పోషించి, 27 ఏండ్ల వయస్సులో ఉరిశిక్షను ఆనందంగా స్వీకరించిన అమర యోధుడు అష్ఫాఖుల్లాహ్ ఖాన్ అరుదైన ఫోటోలతో కూడిన చరిత్రను తెలుపుతుంది పుస్తకం.

“ఈ పుస్తకం చదివాక చాలా సార్లు అన్పిస్తుంది, అష్ఫాఖుల్లాహ్ ఖాన్ అంతటి త్యాగం చేయకుండా వుంటే, ఆనాటి విప్లవ చరిత్ర గొప్ప మలుపు తిరిగేది కాదు. చాలా భావాలలో ఆయన భగత్ సింగ్ కన్నా ముందున్నారు.....ఆనాటి ఉద్యమ దీప్తి గురించి తెలుసుకోవాలనుకున్నా, ఆనాటి ముస్లిం యువకుల దేశభక్తి గురించి తెలుసుకోవాలన్నా ఈ పుస్తకం అవశ్యం పఠనీయం.”

– ప్రముఖ రచయిత డీ. నటరాజ్.

4. భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లిం ప్రజాపోరాటాలు

బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా 1765 ప్రాంతం నుండి సాగిన ప్రజాపోరాటాలలో ప్రధానమైన బెంగాల్ సన్యాసులు–ఫకీర్ల ఉద్యమం, మౌల్వీ అహ్మద్ షహీద్ రహ్మతుల్లాహి అలైహ్, వారి అనుచరుల తిరుగుబాట్లు, ఫరాజీ వీరుల విజృంభణ, మలబారు మొప్లాల వీరోచిత పోరాటం, ఖుదాయీ ఖిద్మత్‌గార్ల అహింసోద్యమ చరిత్రను విపులంగా వెల్లడిస్తుంది పుస్తకం.

“నిజం చెప్పమంటారా ? ఈ పుస్తకం చదువుతున్నంత సేపు నేనొక స్వాతంత్ర్య సమర యోధుడిలా స్వారీ చేశాను. నేనొక జ్ఞాన జ్యోతిగా వెలుగొందాను. నేనొక

చరిత్ర నిర్మాతగా ముందుకు కదులుతున్నాను. మీరూ నాతో నడుస్తారా ? రండి. మన మాతృభూమిని రక్షించుకుందాం. మరో స్వాతంత్ర్యపోరాటానికి కేకవేస్తున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ తోపాటుగా ...నేను...మీరు..మనం."

–కత్తి పద్మారావు

5. భారత స్వాతంత్ర్యోద్యమం: ముస్లిం మహిళలు



స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని విశిష్ట త్యాగాలతో, అపూర్వ ధైర్య సాహసాలతో ఆంగ్లేయుల మీద ఉద్యమించిన ముస్లిం మహిళల జీవితగాథలను దృశ్యీకరిస్తూ 1857 నుండి 1947 వరకు సాగిన వివిధ పోరాటాలలో భాగస్వాములైన 61 యోధురాండ్ర విశేషాలను, విశదీకరిస్తుంది గ్రంథం.

"భారత స్వాతంత్ర్య సాధనలో, అభ్యుదయ పరంపరలో భాగస్వాములైన ముస్లిం వనితల చరిత్రను వెలువరించి, హిందువులమే భారత స్వాతంత్ర్యాన్ని సాధించామని, ముస్లింలకు భాగస్వామ్యం లేదని చాటే మరుగుజ్జులకు చెంపదెబ్బగా ఈ రచన శాశ్వతంగా నిలుస్తుంది..."

–ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య, 12-6-1999

6. భారత స్వాతంత్ర్య సంగ్రామం: ముస్లిం యోధులు – 1

1757 నుండి బ్రిటీషర్ల పెత్తనానికి వ్యతిరేకంగా సాగిన పలు ప్రజాపోరాటాన నుంచి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం, జాతీయోద్యమంలో పాల్గొని తమదైన మార్గంలో ఆంగ్లేయ పాలకులతో తలపడిన 35 మంది యోధాగ్రేసుల చిత్రాలు, విశేషాలను తెలియజేస్తుంది గ్రంథం.

నశీర్ ఈ గ్రంథం ద్వారా పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేయడమేగాదు, ఏ చరిత్రకారుడు ఒకచోట సమకూర్చలేని చరిత్రను ఇంతవరకు అందని అనేక విషయాల్ని మొదటిసారిగా అందించినందుకు అభినందనీయుడు. ఈ గ్రంథం ఉమ్మడి సంస్కృతి వారసత్వ పరిరక్షణలో మరో మైలురాయి కాగలదు.

– ఎ.బి.కే ప్రసాద్, ప్రముఖ పాత్రికేయులు, హైదరాబాద్

7. చిరస్మరణీయులు (బ్రిటీష్ వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్న ముస్లిం యోధులు)



1757 నుండి 1947 వరకు సాగిన బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న ముస్లిం యోధుల నుండి ఎంపిక చేసిన 100 మంది వీరుల సాహసోపేత త్యాగపూరిత పోరాట చరిత్రను క్లుప్తంగా వివరిస్తుంది పుస్తకం.

8. 1857: ముస్లింలు

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లింలు సాగించిన పోరాటాన్ని, ఆనాడు వ్యక్తమైన హిందూ- ముస్లిం ఐక్యతను, ఆంగ్లేయుల క్రూరత్వం, త్యాగాలు ఒకరు చేస్తే భోగాలు మరొకరు అనుభవిస్తున్న తీరు, విస్మరణకు గురైన ముస్లింల త్యాగాలను సరికొత్త కోణం నుండి చర్చకు పెట్టిన గ్రంథమిది.

నేను నాదేశాన్ని ప్రేమిస్తాను అని భావించే ప్రతి ఒక్కరూ చదవదగ్గ జ్ఞానకిరణం ఈ పుస్తకం.

–డాక్టర్ ఇనుకొండ తిరుమలి, చరిత్ర శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం

9. భారత స్వాతంత్ర్యోద్యమం: ఆంధ్రప్రదేశ్ ముస్లింలు

భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్రప్రదేశ్ ముస్లింల పాత్రను (1780–1947) వివరిస్తూ వెలువడిన

బృహత్తర చరిత్ర గ్రంథం. ఈ పుస్తకంలో 55 మంది సమరయోధుల జీవిత విశేషాలు, అపురూపమైన చిత్రాలు, ఫోటోలతోపాటు జిల్లాల వారిగ 200 మంది జాతీయోద్యమకారుల వివరాలు ఉన్నాయి.

“....ముస్లింల దేశభక్తిపై ప్రశ్నలు కురిపించే...నిద్రనటులకు సమాధానం విషయం ఏమోగాని, ముస్లింల స్వాతంత్ర్య పోరాటాల త్యాగమయ చరిత్ర స్వయాన ముస్లిం ప్రజానీకం పాలిట మాత్రం కల్పతరువుగా ఈ పుస్తకాన్ని భావిస్తానంటూ ప్రొఫెసర్ అబ్దున్ నూర్ బాషా, నశీర్ కృషిఅనని ప్రశంసించిన తీరును, ఈ పుస్తకం చదివిన ప్రతి పాఠకుడు అంగీకరించక తప్పదు... ఈ రేఖాచిత్రాలను ఎంతో బలంగా, స్ఫూర్తిదాయకంగా, నిజాయితీగా “కొండ అద్దంముందు కొంచమై ఉండదా?” అన్న విధంగా చిత్రించారు రచయిత...ఇటువంటి విశేష సమాచారంతో తెలుగులో ఇంత వరకు ఇటువంటి గ్రంథం రాలేదు.”

–ఎడిటర్, వారపత్రిక, 3–9 అక్టోబర్, 2001.

10. చరితార్థులు ఆల్బం, THE IMMORTALS Album



1757 నుండి 1947 వరకు బ్రిటీష్ వలస పాలకులను వ్యతిరేకంగా సాగిన పోరాటాలలో పాల్గొన్న భారత ఉపఖండంలోని ముస్లిం యోధుల చిత్రపటాలు, సంక్షిప్త వివరాలు.

“ప్రస్తుత ఆల్బం “చరితార్థులు” రూపకల్పన చాలా విశిష్టమైనది. ఎందుకంటే ఇది చారిత్రాత్మక వాస్తవాలను నిజాయితీగా, సరైన దృక్పధంతో వ్యక్తీకరిస్తుంది. ప్రజాస్వామికమూ, సకలజన హితమూ అయిన భారతదేశంలోని సామరస్యాన్ని విఛ్ఛిన్నంగా చేస్తూ, ద్విజాతి సిద్ధంతాన్ని నమ్ముతూ మౌఢ్యాన్ని, మతవిద్వేషాన్ని ప్రభోదించేవారి సిద్ధాంతాలను ఈ రచన నేలమట్టం చేస్తుంది. ఈ దేశానికి చెందిన అతి పెద్ద అల్పసంఖ్యక వర్గమే

ఈ దేశానికి అపాయకరమంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఈ రచన కుప్పకూలుస్తుంది. ఈ దేశ స్వాతంత్ర్య సముపార్జనలో ముస్లింల కృషి ఏ ఇతర వర్గం కృషి కంటే ఏ మాత్రం తక్కువకాదు అనే వాస్తవాన్ని వెల్లడిస్తుంది. ముస్లింలకు వ్యతిరేకంగా ఫాసిస్టు శక్తులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిరుగులేని విధంగా తిప్పికొట్టడానికి అవసరమైన నికర వాస్తవాలను ఈ ఆల్బం అందిస్తుంది.

– ప్రొఫెసర్ షంషుల్ ఇస్లాం, Delhi University, Delhi.

ఈ వ్యాసాన్ని ముగించక ముందు కొందరికి కృతజ్ఞతలు తెలుపుకోవడం మన ధర్మం. ఎందుకంటే మన ప్రియ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ విధంగా ఉపదేశించారు:

لَا يَشْكُرُ اللهَ مَنْ لا يَشْكُرُ النَّاسَ

మనుషులకు కృతజ్ఞతలు తెలుపనివాడు అల్లాహ్‌కు కూడా కృతజ్ఞత తెలుపలేడు.

పై హదీసు ఆధారంగా ముందు రచయిత మాతృమూర్తి శ్రీమతి బిబీజాన్ గారికి, వారి సతీమణి, వారి కుమార్తె మరియు మేన మామలకు యావత్తు ముస్లిం సముదాయం తరఫు నుండి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుకుంటున్నాము. వారి ప్రోత్సాహము లేనిదే రచయితకు తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇంటి బాధ్యతలన్నిటినీ వారిపై మోపి నిస్వార్థంగా కేవలం దేశ మరియు ముస్లిం సముదాయ ప్రగతి కోసం దేశమంతటా పర్యటించి ఈ అమూల్యమైన సమాచారాన్ని సేకరించి, దాన్ని పుస్తక రూపంలో పేర్చి మనకు అందించడం సాధ్యపడేదికాదు. అల్లాహ్ వీరందరి సేవలను స్వీకరించి తగిన ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక, ఇరులోకాలలో సుఖసంతోషాలను, శాంతిని ప్రసాదించుగాక. ఆమీన్ !

సయ్యద్ నశీర్ అహ్మద్ గారి 15 సంవత్సరాల నిరంతర, నిస్వార్థ కృషి ఫలితంగా వెలువడిన ఈ గ్రంధాలను ప్రతి ఒక్కరు చదవాలని కోరుకుంటున్నాము. పాఠకులు ఈ పుస్తకాల pdf ఫైల్స్‌ను ఉచితంగా పొందగలరు. చరితార్థులు ఆల్బం మినహాయించి అన్ని పుస్తకాలు మా ఫేస్ బుక్ పేజ్ facebook.com/idaraashrafululoomనుండి డౌన్‌లోడ్ చేసుకోగలరు, లేదా మా నంబర్ 9030557865 పై వాట్స్ఆప్ ద్వారా సంప్రదించి పుస్తకాల లింక్స్ పొందగలరు. లేదా నేరుగా రచయిత సయ్యద్ నసీర్ ఆహ్మద్ గారికి ఈ మేల్ చేసి కూడా పొందగలరు. రచయిత ఈమేల్ అడ్రస్: naseerahamedsyed@gmail.com

ఈ పుస్తకాలను తెప్పించుకోవాలనుకునేవారు ఈ అడ్రస్ పై సంప్రదించగలరు.

ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్
3–506, అప్నా ఘర్, ఉండవల్లి సెంటర్–522501, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా.
Mobile: 9440241727, Mail: naseerahamedsyed@gmail.com

భారత స్వాతంత్ర్యోద్యమం ఆంధ్రప్రదేశ్ ముస్లింలు

(భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్రను వివరిస్తూ పలు పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను వెలువరించిన ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ గ్రంథాలలోని విశేషాంశాలను మా పాఠకుల కోసం ధారావాహికంగా అందజేయాలన్న సంకల్పంలో భాగంగా 2011లో పునర్ముద్రించబడిన ఆయన గ్రంథం 'భారత స్వాతంత్ర్యోద్యమం – ఆంధ్రప్రదేశ్ ముస్లింలు' లోని సమాచారాన్ని క్లుప్తీకరించి ప్రచురిస్తున్నాం. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింల పాత్ర గురించి తేట తెలుగులో ఆయన వెలువరించిన పది చరిత్ర గ్రంథాల్లోని సమాచారాన్ని కూడా మా 'పైగామ్ ఏ హిదాయత్' లో ప్రచురించుకునేందుకు అనుమతించినందుకు ఆయనకు మా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. – సంపాదకులు.)

బ్రిటీష్ బానిస బంధనాల నుండి విముక్తి కోరుకుంటూ సాగిన స్వాతంత్ర్యోద్యమంలో భిన్నత్వంలో ఏకత్వం–ఏకత్వంలో భిన్నత్వం, అంతర్గత మార్గదర్శక సూత్రంగా భారతీయ సాంఘిక జనసముదాయాలలో ఒకటైన ముస్లిం జనసముదాయం మాతృభూమి పట్లగల అవ్యాజ ప్రేమాభిమానాల ఫలితంగా ధన మాన ప్రాణాలను పణంగా పెట్టి సోదర సమానులతో కలసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఉద్యమించి స్వదేశీ పాలన సాధించుకోవడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఈ మేరకు ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన మహత్తర పాత్రకు అంతర్గత, బహిర్గత కారణాలు, జాతీయ స్థాయి పరిణామాల మూలంగా చరిత్రలో లభించాల్సినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత, ప్రచారం లభించలేదు. ఆ కారణంగా ఆనాటి ఆత్మార్పణలు, త్యాగాలు చరిత్ర గర్భాన మరుగున పడిపోయాయి.

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 1780లో విశాఖపట్నంలోని ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరంలో జరిగిన కంపెనీ సైన్యంలో సుబేదార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ అహ్మద్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ సైనికుల కట్టలు తెంచుకున్న ఆగ్రహానికి తట్టుకోలేక కంపెనీ సైన్యాధికారులు కాళ్ళకు బుద్ధి చెప్పగా, స్థావరంలోని కోశాగారంలోని ధన సంపదను, ఆయుధాగారాన్ని సూబేదార్ అహ్మద్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత ఆంగ్లేయుల తొత్తులుగా మారిన జమీందార్ల కారణంగా, షేక్ సుబేదార్ అహ్మద్‌తోపాటుగా తిరుగుబాటు యోధులు మరణశిక్షలకు ఎరయ్యారు.

స్వజనుల మీద బ్రిటీష్ పెత్తనాన్ని సహించలేక, ఆంగ్లేయాధికారుల చర్యలను వ్యతిరేకించిన తొలినాటి ప్రముఖులలో నూరుల్ ఉమ్రా, బహదూర్ నైజాం దర్బార్‌లో అతి ముఖ్యులు. ఈస్ట్ ఇండియా కంపెనీలోని స్వదేశీ సైనికులను బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా వ్యవహరించమంటూ 1806 ప్రాంతంలో నూరుల్ ఉమ్రా ప్రోత్సహించిన కారణంగా దర్బారు నుండి బహిష్కరణకు గురైన ఆయన ఉస్మానాబాద్ జిల్లాలోని ఔసా కోటలో 1818లో కన్నుమూశారు.

నూరుల్ ఉమ్రా తరువాత నిజాం నవాబు సికందర్ షా బహదూర్ కుమారుడు, అప్పటి నైజాం నవాబు నాసిరుద్దౌలా సోదరుడు అయినటువంటి ముబారిజుద్దౌలా ఆంగ్లేయుల పెత్తనాన్ని వ్యతిరేకించి ఆత్మాభిమానంగల స్వదేశీ సంస్థానాధీశులు, నవాబులతో కలిసి పోరాటానికి సిద్ధమైనందుకు ఆంగ్లేయుల ఆగ్రహానికి గురై గోల్కొండ కోటలో శిక్షను అనుభవిస్తూ 1854 జూన్ 25న కన్నుమూశారు.

ఈ పోరాటం కోసం భారీ ఎత్తున ఆయుధాలను తయారు చేస్తూ పట్టుబడిన కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ జీవితం తిరుచునాపల్లి జైలులో 1840 జూలై 12న ముగిసింది.

ఉత్తరాధిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం ఆరంభం కాకముందే ఆంధ్ర–తెలంగాణ ప్రాంతాలలో ఆత్మాభిమానం గల యోధులు, బ్రిటీష్ అధికారుల ఆజ్ఞలను ఖాతరు చేయకుండా తిరుగుబాటు పతాకాలను ఎగుర వేసిన యోధుల ప్రభావం నిజాం సంస్థానంలో కూడా ఆ ప్రభావం స్పష్టంగా బలపడసాగింది. ఈ పోకడలు ఎంతవరకు విస్తరించాయంటే పోరబాట నడవండి మేం మీ వెంట ఉంటాం అంటూ సంస్థానాధీశుడికి ప్రజానికం నేరుగా సలహా ఇచ్చేంత స్థాయిలో బ్రిటీష్ వ్యతిరేకత నైజాం సంస్థానంలో ఉనికి సంతరించుకుని ఊపందుకుంది. ఈ వాతావరణం మరింత ప్రబలి తెల్లవార్ని తరిమి కొట్టమని, మట్టుబెట్టమని నినాదాలు ఉధ్భవించాయి. చివరకు 1857 జూలై 17న నగరంలోని ప్రజలు, ప్రముఖులు మాక్కా మసీదు వద్ద సమావేశమై మౌల్వీ అల్లావుద్దీన్, పఠాన్ తుర్రేబాజ్ ఖాన్‌ల నేతృత్వంలో బ్రిటీష్ రెసిడెన్సీ మీద సాహసోపేత దాడి జరిపారు. ఆ సంధర్భంగా కడపజిల్లా ఎల్లంపేట నివాసి షేక్ పీర్ సాహెబ్ 1857 ఆగస్టు 28న తిరుగుబాటుకు సిద్ధం కమ్మని పిలుపునిచ్చి, ప్రయత్నాలు ఆరంభించగా ఆ రహస్యం కాస్త పొక్కడంతో ఆంగ్లేయుల దాష్టికానికి ఆయన బలయ్యారు. ఈ పోరాటాల స్ఫూర్తితో కృష్ణా–గోదావరి మండలాలలో, గుంటూరులో తిరుగుబాటు ఛాయలు కనిపించాయి. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ 1857 ఆగస్టు 22న రాజమండ్రిలోని ఆంగ్ల అధికారి మద్రాసులోని కంపెనీ ప్రధానకార్యదర్శికి రాసిన లేఖలో భారీ కుట్రను మొగ్గలోనే తుంచగలిగాం... ముసల్మాన్లు ఇందులో ప్రధాన పాత్ర వహించారని పేర్కొన్నాడు. ఈ విధంగా 1857 నాటి పోరాటాంలో బ్రిటీషర్ల మీద తిరుగుబడిన జనులు, జవానులు చాలా మంది ఉన్నారు. ఆ సాహసుల చరిత్రలు పూర్తిగా నమోదుకు నోచుకోకపోవడంతో ఆ వివరాలు ప్రజలకు అందకుండా పోయాయి. చరిత్ర పుట్టలలో మరుగున పడిపోయాయి.

ఆ సమయంలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పలు సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య, విద్యా సంస్థలు, ప్రజా సంఘాలు, పత్రికలు రంగం మీదకు వచ్చి చేసిన కృషి కారణంగా 1885లో భారతీయ జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది. ఆ తరువాత 1887వ సంవత్సరంలో మద్రాసు నగరంలో జస్టిస్ బద్రుద్దీన్ తయ్యాజీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశానికి తెలుగునాట నుండే హుస్సేన్ బేగ్, మిర్జా హుస్సేన్ బేగ్, సయ్యద్ సాహెబ్, ఖాదర్ ఖాన్, ఖాసిం మియా సాహెబ్, ఆ తరువాత 1889లో బొంబాయి నగరంలో జరిగిన సమావేశానికి బుర్హానుద్దీన్ సాహెబ్, ఖలీల్ ఖాన్, అలీ ఖాన్, అహ్మద్ సాహెబ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిజాం నవాబు ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న ముల్లా అబ్దుల్ ఖయ్యూమ్ కాంగ్రెస్‌లో సభ్యత్వం స్వీకరించడమే కాకుండా ముస్లింలంతా భారతీయ కాంగ్రెస్‌లో చేరాలని, కార్యక్రమాలలో పాల్గొనాలని బహిరంగంగా పిలుపునిస్తూ, ప్రముఖ ముస్లిం మేధావి సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ భారత జాతీయ కాంగ్రెస్‌ను విమర్శిస్తూ చేసిన వాదనలు పూర్వపక్షం చేస్తే సాహిత్యాన్ని సృజియించి పంపిణీ చేసిన కారణంగా నిజాం నవాబు ఆగ్రహానికి గురయ్యారు. ఈ నాయకుల కృషి వలన ఆనాడు ముస్లిం జనసమూహాలలో భారత జాతీయ

కాంగ్రెస్ పట్ల సానుకూలత వ్యక్తం కావడమే కాకుండా, జాతీయ కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి జాతీయ స్థాయి సాంవత్సరిక సమావేశానికి ముస్లింల హాజరు గణనీయంగా పెరిగింది. ఈ పరిణామాల ఫలితంగా భారత జాతీయ కాంగ్రెస్ కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో ఉ ధృతంగా కాకపోయినా ప్రతిస్పందన మాత్రం ఆరంభమైంది.

భారత జాతీయ కాంగ్రెస్ లాంటి ప్రధాన సంస్థలు తగిన విధంగా కృషి జరుపుతునప్పటికి 1900 తరువాత మాత్రమే జాతీయ్యోద్యమం బాగా ఊపందుకుంది. 1906లో జరిగిన బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసనోద్యమానికి తెలుగు ప్రజల మద్దతు బాగా లభించింది. 1907లో బిపిన్ చంద్రపాల్ పర్యటనతో ఆంధ్రదేశాన్ని పూర్తిగా చుట్టేసింది. జాతి, మత, ప్రాంతాల విభేదాలు మరచి వందేమాతరం గీతాన్ని ఆలాపిస్తూ ప్రజలు ముందుకురికారు. వందేమాతరం ఉ ద్యమంతో రగులుకున్న సహాయనిరాకరణ ఉద్యమం రాష్ట్రంలో పలు చారిత్రక సంఘటనలకు కారణమైంది. ఈ సహాయనిరాకరణ మరింత పరిణితి చెంది కొంతకాలానికి శాసన్లోంఘనగా రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు అవసరమగు నిధుల సేకరణకు రాష్ట్రంలో ప్రయత్నాలు జరిగాయి. మద్రాసులో స్వదేశీ ఉద్యమ వ్యాప్తి కోసం దీపావళి జాతీయ నిధి ఏర్పాటు చేశారు. ఆ నిధికి సయ్యద్ ముహమ్మద్, న్యాయపతి సుబ్బారావులు ధర్మకర్తలుగా వ్యవహరించారు.

బెంగాల్ విభజన సంఘటన ఆంధ్రప్రదేశ్‌లో పెనుగాలులకు కారణం కాకపోయినా ఉద్యమ దిశగా అనుకూల కదలికలకు కారణమైంది. ఆ కదలికల ఫలితంగా ఆ తరువాత ఆరంభమైన హోంరూల్ ఉద్యమంలో ప్రజలు పెద్దఎత్తున భాగస్వాములయ్యారు. ఈ ఉద్యమంలో భాగంగా జరిగిన పలు సభలు, సమావేశాలలో ముస్లిం ప్రముఖులు చురుకుగా పాల్గొన్నారు. 1916 నవంబరు మాసంలో కడపజిల్లా రాజంపేటలో జరిగిన బహిరంగ సభకు బనగానపల్లి సంస్థానానికి చెమదిన ప్రముఖులు మీర్ ఆసిఫ్ అలీ బహదూర్ అధ్యక్షత వహించారు. స్వయంపాలనాధికారాన్ని సాధించేవరకు ప్రజలు సంతృప్తి చెందరాదని, స్వయం పాలనాధికారాన్ని ఎట్టి పరిస్థితులలోనైనా సాధించి తీరాలని ఈ సందర్భంగా ఆయన ఉద్బోధించారు.

బ్రిటీష్ పాలకులు 1919 మార్చిలో రౌలత్ చట్టాన్ని తెచ్చి ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించివేసేందుకు ప్రయత్నించారు. రౌలత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ 1919 మార్చి 20న మద్రాస్‌లో సభ జరిగింది. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరైన ఈ సభలో మీర్ సుల్తాన్ మొహియుద్దీన్ పాల్గొని ప్రసంగించారు. ఈ ప్రయత్నాన్ని కొనసాగిస్తూ రౌలత్‌కు వ్యతిరేకంగా కృషి సాగించిన వారిలో ఖాన్ బహదూర్ ఖుద్దూస్, అబ్దుల్ హకీమ్‌లు ఉన్నారు. చెన్నపురిలో జరిగిన హర్తాల్ సందర్భంగా మహమ్మదీయులంతా తమ దుకాణాలను మూసివేసి హర్తాలును సంపూర్ణంగా పాటించారు. బెజవాడలో మహమ్మదీయులు ప్రార్థనల తరువాత పెద్ద సభ ఏర్పాటు చేసి రౌలత్ శాసనం రద్దు కావాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన సభలో ప్రముఖ కవి మౌల్వీ ఉమర్ అలీషా రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా గంభీరోపన్యాసాలు చేశారు. ఈ విధంగా మహాత్ముని పిలుపుమేరకు మద్రాస్ రాష్ట్రంలో భాగంగా గల తెలుగు గడ్డ మీద

జరిగిన రౌలత్ వ్యతిరేక ఉద్యమంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భౌతికంగా కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా ఆర్థికంగా చాలామంది సంపన్నులు ఆదుకోవడం జరిగింది. ఈ మేరకు తమదైన రీతిలో బ్రిటీష్ ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రతిస్పందిస్తుండగా స్వాతంత్ర్యోద్యమంలో అతి ప్రధాన పోరాట రూపంగా భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో స్థానం సంపాదించుకుని, మహోధృతంగా సాగిన ఖిలాఫత్–సహాయ నిరాకరణోద్యమం దూసుకొని వచ్చింది.

భారతీయులలో పెరుగుతున్న స్వేచ్ఛా స్వతంత్ర భావాలను, ప్రజా ఉద్యమాలను అదుపుచేయడానికి, అణిచి వేయడానికి బ్రిటీషర్లు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రారంభించారు. ప్రధమ ప్రపంచ యుద్ధం సందర్భంగా ప్రపంచ ముస్లింల పవిత్ర స్థలాలకు తగిన రక్షణ కల్పిస్తామని చెప్పిన బ్రిటీష్ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని తుంగలో తొక్కివేస్తు ప్రపంచ ముస్లింలంతా ఎంతగానో గౌరవించే ఖిలాఫత్ వ్యవస్థను రద్దు చేసింది. బ్రిటీషర్ల చర్యకు వ్యతిరేకంగా టర్కీ దేశాధినేత కమల్ పాషా ప్రారంభించిన ఖిలాఫత్ పోరాటానికి భారతీయ ముస్లింలు మద్దతు పలికారు. ఖిలాఫత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన ఖిలాఫత్ ఉద్యమానికి గాంధీజీ మద్దతునిచ్చారు. ఆ కారణంగా సహాయ నిరాకరణ ఉద్యమం, ఖిలాఫత్ ఉద్యమం జమిలిగా భారత రాజకీయ చిత్రపటం మీద ఆవిష్కరించబడ్డాయి. 1920 ఏప్రిల్ 17న గాంధీజీ, ఆలీ సోదరులుగా ఖ్యాతిగాంచిన ముహమ్మద్ అలీ, షౌకత్ అలీలతో కలిసి సహాయనిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు.

ఉత్తర భారతదేశాన్ని పూర్తిగా తన గుప్పెట్లోకి తీసుకున్న ఖిలాఫత్–సహాయనిరాకరణోద్యమ ప్రకంపనాలు అతి త్వరగా ఆంధ్రావనిని అందుకున్నాయి. తొలిసారిగా 1920 మార్చిలో పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ప్రఖ్యాత తెలుగు కవి, పిఠాపురానికి చెందిన డాక్టర్ ఉమర్ అలీషా అధ్యక్షత వహించారు. సభలో ముస్లిమేతర ప్రముఖులతో పాటుగా ముస్లిం ప్రముఖులు షకూర్ సాహెబ్, నాజియా హుస్సేన్‌లు పాల్గొని బ్రిటీషర్ల విధానాలను విమర్శిస్తూ ప్రసంగించారు.

1920 ఆగస్టులో మద్రాసులో మహాత్మా గాంధీ సమక్షంలో జరిగిన సభలో ప్రముఖ ముస్లిం నాయకులు యాకూబ్ హుస్సేన్, డాక్టర్ లతీఫ్, సయ్యద్ సాహెబ్ తదితరులు పాల్గొనగా ఖాన్ బహదూర్ ఖుద్దూస్ సాహెబ్ సభకు అధ్యక్షత వహించారు. ఆ తరువాత 1921లో తూర్పుగోదావరి జిల్లా ఏలూరులో జరిగిన మరొక సభలో అలీగడ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ముహమ్మద్ అబ్దుల్ హకీం, ముహమ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్‌లు ప్రసంగించారు. ఈ సభలో భారతీయ ముస్లింల కోర్కెలను తీర్మానాలుగా రూపొందించారు. ఆ తరువాత ఉద్యమంలో పాల్గొన్నందుకు కేరళ నాయకుడు యాకూబ్ హసన్ తదితర నేతలను అరెస్టు చేసిన సంఘటనకు నిరసనగా ఏలూరులో సంపూర్ణ హర్తాల్‌ను నిర్వహించారు.

ఈ సందర్భంగానే మద్రాసు నుండి ప్రచురితమౌతున్న ఖౌమీ రిపోర్టు పత్రికసంపాదకులు అబ్దుల్ మజీద్‌షా పశ్చిమగోదావరి జిల్లాకు వచ్చి వివిధ గ్రామాలలో పర్యటించి ఖిలాఫత్ సహాయనిరాకరణ ఉద్యమాలను జయప్రదం చేయాల్సిందిగా ప్రజలను కోరుతూ సభలు సమావేశాలు

నిర్వహించారు. ముస్లిం జనసముదాయాలు అధికంగా గల ప్రాంతాలలో ఖిలాఫత్– సహాయనిరాకరణ ఉద్యమాలు ఉధృక్తమయ్యాయి. రాయలసీమ కడప జిల్లా తాడిపత్రికి చెందిన సులేమాన్ సాహెబ్ సహాయ నిరాకరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1921 నవంబరు 25న అరెస్టు చేయబడిన ఆయన ఆరు మాసాల పాటు బళ్ళారి సెంట్రల్ జైలులో గడిపారు. తాడిపత్రి నివాసి అబ్దుల్లా సాహెబ్ ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఐదు మాసాల జైలుశిక్ష పడింది. ఆయనతో పాటుగా తిరుపతి నివాసి మదార్ సాహెబ్, తాడిపత్రికి చెందిన మరొకరు షేక్ మాలిక్ షక్కర్ బరూన్ పలు శిక్షలకు గురయ్యారు. అనంతపురం జిల్లా హిందుపురంలో స్థానిక ఖిలాఫత్ కమిటీ కార్యదర్శిగా హుసేన్ ఉద్యమానికి నాయకత్వం వహించారు. కర్నూలులోని మౌంట్ రోడ్‌లో గల ఆజం కళాశాల విద్యార్థులు యాకూబ్ హుస్సేన్, అబ్దుల్ మజీద్ షరార్, అమీర్ అలీ, బాబు భై మజ్‌హర్, సయ్యద్ మొహియుద్దీన్ తదితర విద్యార్థులు 1920 అక్టోబరు 21న స్థానిక మసీదు వద్ద ప్రసంగిస్తూ 22నాటి విద్యార్థుల సమావేశానికి హాజరు కావాల్సిందిగా పిలుపునిచ్చారు.

ఆ రోజున జుమ్మా ప్రార్థనల తరువాత జరిగిన సమావేశంలో సయ్యద్ ముహియుద్దీన్, అమీర్ అలీ అబ్దుల్, మజహర్ అను విద్యార్థినాయకులు సహాయనిరాకరణ అంశం మీద ప్రసంగించారు. ఈ విద్యార్థి నాయకులు కళాశాలల బహిష్కరణకు ఇచ్చిన పిలుపుకు మంచి స్పందన కనిపించింది. ఈ మేరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలోని ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థులు కూడా కళాశాలలను బహిష్కరించారు. ఆ విధంగా గవర్నమెంట్ కాలేజీల చదువులకు స్వస్తి చెప్పిన విద్యార్థులలో కరీంనగర్‌కు చెందిన మీర్ ముహమ్మద్ హుస్సేన్, హైద్రాబాద్‌కు చెందిన అక్బర్ అలీ ఖాన్, ఇంకా సయ్యద్ ముహమ్మద్ అలీ, మక్బూల్ అలీ, ముహమ్మద్ హుస్సేన్ యూసుపుద్దీన్, హమీదుద్దీన్ ముహమ్మద్, ఫఖ్రుద్దీన్ మసూద్, సయ్యద్ ముహమ్మద్ అన్సారీ తదితరులు ఉన్నారు. (నా జీవిత కథ–నవ్యాంధ్రము, అయ్యదేవర కాళేశ్వరరావు, పేజీ 327). అలీగడ్ జాతీయ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఖిలాఫత్ సహాయ నిరాకరణోద్యమాన్ని ఉదబుతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌కు తరలి వచ్చారు. మౌలానా ముహమ్మద్ అలీ మార్గదర్శకత్వంలో ముహమ్మద్ హుస్సేన్, షఫీఖుర్ రహ్మాన్ కిద్వాయ్ తదితరులు ఆంధ్ర ప్రాంతంలోని పలు జిల్లాలలో పనిచేసేందుకు వచ్చి ఆదోని చేరుకున్నారు. అక్కడ కార్యక్రమాలలో పాల్గొంటుండగా ఆ విద్యార్థులను గాడిచెర్ల హరిసర్వోత్తమరావు స్వయంగా కడపకు పిలిపించారు.

1921 అక్టోబరు 11న కడప చేరుకున్న ఈ విద్యార్థులు కడప, గుంటూర్ తదితర ప్రాంతాల నుండి విచ్చేసిన ఇతర విద్యార్థులతో కలసి పలు ప్రాంతాలలో ప్రజలను సమీకరించి సభలు సమావేశాలు నిర్వహించారు. ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేశారు. అక్టోబరు 21న కడపలో ఆరువేల మంది హాజరైన సభలో 2,500 రూపాయలు విరాళాలను ఉద్యమం కోసం ప్రజల నుండి సేకరించారు. ప్రజల అభీష్టానికి అనుకూలంగా ప్రజా డిమాండును మరింతగా పునరుద్ఘాటిస్తూ 1400 మంది చేత సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతగా నిర్వహించారు. ఈ చర్యలతో ఖంగుతిన్న ప్రభుత్వం 1921 అక్టోబర్ 21న ఆ విద్యార్థి నాయకులను

అరెస్టు చేసి, ఆరు మాసాల జైలు శిక్షను విధించింది. ఆనాటి అలీగడ్ విద్యార్థుల చర్యలు ఆంధ్ర లోని పలు కళాశాలల అధ్యాపకులను కూడా అమితంగా ఆకట్టుకున్నాయి. ఆ విద్యార్థుల చర్యల స్ఫూర్తితో ఆజం కళాశాలకు చెందిన తర్కశాస్త్ర అధ్యాపకులు అబ్దుల్ ఖాదర్ అలీ తమ కళాశాలను బహిష్కరించాలని నిర్ణయించుకోవడమే కాకుండా సహచర అధ్యాపకులకు సలహా ఇచ్చి ప్రోత్సహించారు. ఈ ఉద్యమంలో అటు మేధావులు ఇటు సామాన్య ప్రజలు కూడా అమితోత్సాహంతో పాల్గొన్నారు. రాయలసీమకు చెందిన బీడీ కార్మికుడు కరీం సాహెబ్ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆరు మాసాల జైలుశిక్ష 160 రూపాయల జరిమానాను భరించారు. అలీ సోదరులు, మహాత్మాగాంధీ ఆదేశాలను తూచ తప్పకుండా ఆచరిస్తూ ప్రజలు ఏకోన్ముఖంగా ముందుకు సాగారు. ఈ విధంగా వివిధ సామాజిక జనసముదాలు ఏకమై ఉద్యమించడంతో ఉద్యమం జాతీయ స్థాయి రూపాన్ని సంతరించుకుంది.

భారత దేశ పర్యటనలో భాగంగా, ఖిలాఫత్ ఉద్యమ ప్రముఖులైన అలీ సోదరులతో కలిసి గాంధీజీ ఆంధ్రకు వచ్చారు. చరిత్ర సృష్టించిన ఈ పర్యటన విజయవాడ నుండి ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహాత్ముడు 1920 జనవరి 1న జరిగిన సభలో ప్రసంగిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం అందజేసిన బిరుదులను త్యజించాలని, పదవులను వదులుకోవాలని కోరారు. ఆ పిలుపుకు విజయవాడకు చెందిన జాగీర్దార్ ముహమ్మద్ గులాం ముహియుద్దీన్ సాహెబ్ తక్షణమే స్పందించారు. ఆయన నిర్వహిస్తున్న గౌరవ మెజిస్ట్రేటు పదవికి తక్షణమే రాజీనామా చేశారు. ఆ విధంగా గాంధీజీ పిలుపుకు స్పందించి ప్రభుత్వ పదవిని త్యజించిన తొలి ఆంధ్రుడిగా ముహమ్మద్ గులాం ముహియుద్దీన్ ఖ్యాతిగాంచారు. గాంధీజీ పిలుపు మేరకు, ప్రభుత్వ పదవులు దిగతుడుపుగా భావించిన ముహమ్మద్ గులాం ముహియుద్దీన్ స్ఫూర్తితో, మద్రాసు అసెంబ్లీకి పోటీ చేస్తున్న ఖాజీ అబ్దుల్లా, ఖాన్ సాహెబ్, అన్వర్ జమాఖాన్ సాహెబ్, అబ్దుల్ మజీద్ తదితర ప్రముఖులు ఎన్నికలను బహిష్కరిస్తూ తమ అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకున్నారు. రాయలసీమ యోధుడు యం. షంషీర్ బేగ్ తన చదువుకు స్వస్తి పలికి విశ్వవిద్యాలయాన్ని వదిలి వచ్చేశారు.

1921లో బెజవాడలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలు జరిగాయి. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని పండగలా జరుపుకున్న ఈ సమావేశాలలో మహాత్మాగంధీ, ఇతర జాతీయ నాయకులతో పాటుగా అబ్బాస్ తయ్యాజీ, హకీమ్ అజ్మల్ ఖాన్, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, ముహమ్మద్ అలీ, షౌకత్ అలీ, ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ లాంటి ముస్లిం ప్రముఖులు విచ్చేశారు. ఆంధ్ర నాయకులు క్రియాశీల పాత్ర వహించిన ఈ సమావేశాలలో స్థానిక నాయకుడు షఫీ అహమ్మద్ ప్రముఖ పాత్ర వహించారు. ఈ సమావేశాల నిర్వహణకు విజయవాడకు చెందిన జాగీర్దార్ ముహమ్మద్ గులాం ముహియుద్దీన్ సాహెబ్ తన ధనాన్ని మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేశారు.

బ్రిటీష్ ప్రభుత్వం ప్రసాదించిన పదవులు, బిరుదులు వదులుకోమని, సంపూర్ణ సహాయ నిరాకరణ పాటించమని జాతీయ నాయకులు ఇచ్చిన పిలుపును అందుకుని ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చెందిన మౌల్వీ జాహిద్ హసన్ సాహెబ్, జమాల్ ముహియుద్దీన్ సాహెబ్, షంషుల్ ఉలమా,

ఖాన్ సాహెబ్ ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించిన పలు గౌరవ బిరుదులను, పదవులను తృణప్రాయంగా భావించి వదులుకున్నారు. గుంటూరుకు చెందిన మౌల్వీ ముహమ్మద్ రజా ఖాన్ బెల్‌గామీ సహాయనిరాకరణ ఉద్యమంలో ప్రధాన పాత్ర వహించారు. ఆయన ఖిలాఫత్– సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా మండల ఖిలాఫత్ సంఘానికి అధ్యక్షత వహించారు. ఖిలాఫత్ కమిటీ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా హిందుపురం మేజిస్ట్రేట్ ముహమ్మద్ హుస్సేన్ సాహెబ్, నబీ సాహెబ్ బహదూర్, టిప్పు ఖాన్ తమ ఉద్యోగాలకు రాజీనామాలు సమర్పించారు. ఆదోనికి చెందిన రోషన్ ముల్లా 1920 జూన్‌లో ఆదోని మున్సిపాలిటీ కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. ఆనాడు ఇటువంటి త్యాగాలు అసంఖ్యంగా సాగాయి. అధికార పదవులలో ఉన్నవారంతా తమ హోదాలకు, పదవులకు, ఆంగ్ల ప్రభుత్వ మొహర్బానికి సామూహికంగా రాజీనామాలు సమర్పించారు.

కర్నూలుకు చెందిన న్యాయవాది సయ్యద్ సాహెబ్ మొహియుద్దీన్ ఖాద్రి బియాబానీ వేలాది రూపాయల సంపాదనను ఆర్జించి పెడుతున్న న్యాయవాద వృత్తిని వదిలేసి జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, డాక్టర్ జాకీర్ హుస్సేన్‌లచే ప్రభావితులైన ఆయన జీవితాంతం జాతీయవాదిగా, స్వేచ్ఛగా స్వాతంత్ర్యాల కోసం సాగిన పోరాటంలో సయ్యద్ సాహెబ్ ముహియుద్దీన్ ఖాద్రీ బియాబానీ భాగస్వామ్యం వహించడం మాత్రమే కాకుండా జాతీయోద్యమానికి తన 500 ఎకరాల భూమిని దానం చేశారు. గాంధీజీ పిలుపునందుకుని న్యాయవాది వృత్తిని వదులుకున్నవారిలో విజయవాడకు చెందిన జనాబ్ అలీ బేగ్ మరొకరు. అలీబేగ్ ఆనాటి రాజకీయాలలో ప్రముఖ సభ్యునిగా బాధ్యతలు నిర్వహించడమేకాక, పార్లమెంట్ సభ్యునిగా ప్రజలకు సేవలందించారు.

1921 ఏప్రిల్‌లో మద్రాసులో మహాత్మాగాంధీ పాల్గొంటున్న సభలో వలియుల్లా బాద్షా సాహెబ్, నాదార్ సాహెబ్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రజలను ఉద్యమించమని ప్రోత్సహిస్తూ ఉద్వేగంగా ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా ఖిలాఫత్–సత్యాగ్రహోద్యమాల ప్రాముఖ్యతను వివరిస్తూ, హిందూ–ముస్లింల ఐక్యత ఎంత అవసరమో ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమంలో ప్రముఖులుగా ఖ్యాతి గాంచిన అలీ సోదరులలో ఒకరైన మౌలానా ముహమ్మద్ అలీతో కలసి మహాత్మా గాంధీ ఆంధ్రప్రదేశ్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా 1921 సెప్టెంబర్ 13న కలకత్తా నుండి రైలులో విశాఖపట్నం వచ్చారు. ఆ ప్రముఖులు విశాఖపట్నం చేరగానే పోలీసులు ముహమ్మద్ అలీని అరెస్టు చేశారు. ఈ అరెస్టు ప్రజలలో ఆగ్రహావేశాలను రగిల్చింది.

ఆ సమయంలో అలీని అరస్టు చేసినందుకు విశాఖపట్నం యోధుడు రజాక్ ఎంతో ఆందోళన చెందారు, ఆగ్రహించారు. పోలీసులు ముందుకు సాగకుండా ఆయన అడ్డుపడ్డారు. అలీని పోలీసులు తీసుకెళ్ళకుండా ఆటంకపరచి అల్లరి లేవదీశారు. ఆ సమయంలో మౌలానాను అరస్టు చేసినందుకు విచారం కలిగితే స్వదేశీ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిందిగా సూచిస్తూ, ప్రజలు శాంతియుతంగా ఉండాలని, సంయనం పాటించాలని మహాత్ముడు కోరారు. (దేశ స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ

జిల్లా స్థానం, విశాఖజిల్లా దర్శిని, విశాఖపట్నం, 2002 మరియు ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ: కొడాలి ఆంజనేయులు)

ఈ విధంగా భారత దేశ వ్యాప్తంగా ప్రజలలో పెల్లుబికిన ఖిలాఫత్–సహాయ నిరాకణోద్యమం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ ఉద్యమ ప్రేరణతో దేశ వ్యాప్తంగా పలు స్థానిక ఉద్యమాలు ఉనికిలోకి వచ్చాయి. బ్రిటీషు ప్రభుత్వ వ్యతిరేకత ఒకటే ప్రధాన చోదక శక్తిగా ఈ ఉద్యమాలు ఉదృతంగా సాగాయి. ఈ విధంగా చరిత్ర సృష్టించిన పలు ఉద్యమాలకు తెలుగు గడ్డ ఆనాడు పుట్టినిల్లయ్యింది.

భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల తరువాత ఆంధ్రలో సహాయ నిరాకరణ ఉద్యమం కాస్తా శాసనోల్లంఘన ఉద్యమంగా మారింది. ప్రజలు అన్ని ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించారు, చట్టాలను ఉల్లంఘించారు. పన్నులు కట్ట నిరాకరించారు. అధికార కార్యక్రమాలకు సహకారం అందించకుండా సహాయనిరాకరణ కొనసాగించారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో పుల్లరి ఉద్యమం సాగింది. చీరాల ప్రాంతంలో దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నేతృత్వంలో చీరాల–పేరాల ఉద్యమం ఉధృతమైంది. పర్తనేని వీరయ్య చౌదరి మార్గదర్శకత్వంలో పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమం చరిత్ర ప్రసిద్ధికెక్కింది. అల్లూరి సీతారామరాజు సాగించిన మన్యం తిరుగుబాటు ఆంధ్రులకు జాతీయ స్థాయిలో ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ఈ ఉద్యమాలన్నిటిలో కూడా ముస్లిం యోధులు పాల్గొని తమదైన ప్రత్యేక చరిత్రకు కారకులయ్యారు.

గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో సాగిన పుల్లరి ఉద్యమంలో సాటి ముస్లిమేతర సోదరులతోపాటుగా ముస్లింలు కూడా పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అవసరాలు, అవస్థలు ఒకటే అయినప్పుడు కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా కలసికట్టుగా ఉద్యమిస్తారనడానికి పల్నాటి పుల్లరి ఉద్యమం నిదర్శంగా నిలిచింది. భారత జాతీయ కాంగ్రెస్ గుంటూరు జిల్లా నాయకులు పుల్లరి ఉద్యమం సంధర్భంగా కార్యక్రమాలలో పాల్గొని అరెస్టులకు గురికాక ముందుగానే మాచర్లకు పొరుగు గ్రామమైన కొత్తపల్లికి చెందిన ముగ్గురు ఉద్యమకారులు పుల్లరి చెల్లింపును వ్యతిరేకిస్తూ, సహాయనిరాకరణ ఉద్యమానికి తోడ్పడుతూ, పుల్లరి వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా ఉద్యమకారులకు అనుకూలంగా నబీ సాహెబ్, జాన్ ముహమ్మద్ వ్యవహరించారు. మొట్టమొదటి సారిగా అరెస్టులకు గురయ్యారని గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం 1920–30 ఉజ్వల ఘట్టాలు గ్రంథంలో ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు మాదల వీరభద్రరావు పేర్కొన్నారు.

గుంటూరు జిల్లా చీరాల కేంద్రంగా సాగిన చీరాల–పేరాల ఉద్యమంలో బాపట్లకు చెందిన ముహమ్మద్ గౌస్ బేగ్ ఎంతగానో కృషి చేశారు. దుగ్గిరాల గోపాల కృష్ణయ్య ప్రధాన సహచరుడిగా ఆయన తన కుటుంబ ఆస్తిపాస్తులను ఉద్యమం కోసం పూర్తిగా వ్యయం చేశారు. చీరాల–పేరాల ప్రజాపోరాటంలోనే కాకుండా ముహమ్మద్ గౌస్ పెదనందిపాడు పన్ను నిరాకరణ ఉద్యమంలో కూడా చురుగ్గా పాల్గొన్నారు. పన్నుల నిరాకరణ ఉద్యమవ్యాప్తి కోసం గ్రామ గ్రామాన ప్రచార

కార్యక్రమం చేపట్టి అవిశ్రాంతంగా శ్రమించారు. ప్రజలలో ప్రధానంగా యవకులలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తూ ఆయన ప్రసంగాలు చేయడమే కాకుండా, బ్రిటీష్ పోలీసుల దాష్టిక చర్యలను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఉద్యమాలలో చురుకుగా పాల్గొని పలుమార్లు ప్రభుత్వ ఆగ్రహానికి గురయ్యారు. (గుంటూరు జిల్లాలో స్వరాజ్య ఉద్యమం: మాదల వీరభద్రరావు)

గుంటూరు జిల్లా పెదనందిపాడు కేంద్రంగా పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో సాగిన పెదనందిపాడు పన్నుల నిరాకరణ ఉద్యమంలో ముహమ్మద్ గౌస్ ప్రధాన పాత్రను నిర్వహించారు. పన్నుల నిరాకరణ ఉద్యమ లక్ష్యాలను, విధివిధానాలను ప్రజలకు తెలపడం, గ్రామాలకు వచ్చే ప్రభుత్వ అధికారులకు ప్రజల నుండి ఎటువంటి సహకారము అందకుండా చూడటం వరకు ఆయన బాధ్యతలు నిర్వహించారు. ఈ ఉద్యమం సందర్భంగా గ్రామాధికారులు తమ పదవులను తృణప్రయంగా భావించి త్యజించారు. ఈ మేరకు ప్రకాశం జిల్లా నివాసి షేక్ చిన్న ఆదం సాహెబ్ ఉప్పుటూరు గ్రామాధికారి పదవికి రాజీనామా చేశారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామాధికారి షేక్ ముహియుద్దీన్, మరొక గ్రామాధికారి షేక్ ఫకీర్ అహ్మద్‌లు తమ పదవులకు రాజీనామా చేసి సత్యాగ్రహ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

జాతి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు కోరుకుంటూ సాగుతున్న జాతీయోద్యమంలో భాగంగా జరుగుతున్న వివిధ పోరాటాలలో తమదైన పాత్ర నిర్వహిస్తూ వచ్చినందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన అబ్దుల్ సాహెబ్ ఐదు మాసాల కఠిన కారాగారవాస శిక్షను అనుభవించారు. చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన మదార్ సాహెబ్ నెల్లూరు, కండలూరు జైళ్లలో 15మాసాలు, 1921లో మద్యనిషేదం ఉద్యమంలో పాల్గొన్నందుకు మరో సంవత్సరం జైలుశిక్షను అనుభవించారు. విశాఖపట్టణానికి చెందిన ముహమ్మద్ అబ్దుల్ రజ్జాక్ పలుసార్లు జైలు పాలయ్యారు. కృష్ణాజిల్లా నూజివీడు నివాసి కొత్వాల్ అబ్బాస్ అలీ సాహెబ్ 9 మాసాలు రాజమండ్రి జైలులో గడిపారు. ఆయన ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ నాయకులుగా, నూజివీడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా 1926 నుండి 1940 వరకు పనిచేశారు. విజయవాడకు చెందిన నసీరుల్లాఖాన్ నాలుగు మాసాలు, నూజివీడు నివాసి ముహియుద్దీన్ బేగ్ నాలుగు మాసాలు, గుడివాడ నివాసి ఖాసిం బేగ్ రెండు మాసాలు రాజమండ్రి జైలులో గడిపారు. నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాకు చెందిన ముహమ్మద్ అక్బర్ సాహెబ్ నెల్లూరు, కడలూరు జైళ్ళలో ఏడాది జైలు జీవితం గడిపారు. నెల్లూరుకు చెందిన వ్యాపారి ముహమ్మద్ గౌస్ సాహెబ్ ఆరు మాసాలు, జైలు శిక్షకు గురయ్యారు. గుంటూరు జిల్లాకు చెందిన అబ్దుల్ హాదీ సాహెబ్ ఒక సంవత్సరం జైలుశిక్ష అనుభవించారు. రేపల్లెకు చెందిన షేక్ దావూద్, షేక్ గులాబ్ హుస్సేన్, షేక్ ఉస్మాన్ నిర్భంధాలకు గురయ్యారు. సత్తెనపల్లికి చెందిన రైతు షేక్ మిర్జా అలీ సాహెబ్ పన్ను వ్యతిరేక ఉద్యమ ప్రచారంలో పాల్గొని ఆరు మాసాలు జైలులో గడిపారు. అదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ఇబ్రాహీం జిల్లాలో ఖిలాఫత్ ఉద్యమాన్ని నడిపి జైలు పాలయ్యారు. ఈ విధంగా విజయవాడకు చెందిన ముహమ్మద్ నూరుల్లా ఖాన్, కృష్ణ నగర్ నివాసి ముహమ్మద్ మింటో, నూజివీడుకు చెందిన ముహియుద్దీన్ ఖిలాఫత్-సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలుశిక్షను అనుభవించారు.

ఖిలాఫత్–సహాయనిరాకరణ ఉద్యమం నైజాం సంస్థానాన్ని కూడా తాకింది. నిజాం నవాబు బ్రిటీషర్లకు ఎంత అనుకూలంగా ఉన్నాకూడా ముస్లిం జనసముదాయాలు మాత్రం ఏమాత్రం జంకకుండా ఉద్యమబాట నడిచారు. హైద్రాబాద్‌కు చెందిన అబ్బాస్ సుభాన్, ముహమ్మద్ అబ్దుర్రహ్మాన్ ఖిలాఫత్–సహాయ నిరాకరణ ఉద్యమాలకు తొలుతగా నేతృత్వం వహించగా, ఖిలాఫత్ కేంద్ర కమిటీకి ముహమ్మద్ అస్గర్ కార్యదర్శిగా వ్యవహరించారు. ఆ ఉద్యమంలో మౌలానా సయ్యద్ అబ్దుల్ హై, ముల్లా అబ్దుల్ ఖయ్యూం, సిరాజుల్ హసన్ తిర్మిజీ ప్రముఖ పాత్ర వహించారు. నైజాం ఆస్థానంలో డిప్యూటీ కలెక్టర్ ముహమ్మద్ రజా బిల్‌గిరామీ ఖిలాఫత్– సహాయ నిరాకరణ ఉద్యమాన్ని పూర్తిగా సమర్థించిన కారణంగా బ్రిటీష్ ప్రభుత్వం ఆయన పెన్షన్ రద్దు చేసింది.

ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో హిందూ–ముస్లింలు తమ ఆచార సాంప్రదాయాలను, మత మనోభావాలను గమనంలో పెట్టుకుని సాగుతున్నట్టుగానే హైదరాబాదులో కూడా ఖిలాఫత్–సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా గోవధను నిషేధిస్తూ, గోమాంసం స్వీకరించరాదని నిర్ణయించారు. జాతీయోద్యమ నేత ముల్లా అబ్దుల్ ఖయ్యూమ్ ముంజేతికి హిందూ సోదరులు ప్రేమపూర్వకంగా రాఖీలు కట్టగా, భారీ సంఖ్యలో సమావేశమైన హిందూ–ముస్లింలు పరస్పరం రాఖీలు కట్టుకొని ఐక్యతను ప్రదర్శించిన ఘట్టాల గురించి తెలుసుకున్న బ్రిటీష్ రెసిడెంట్ మండిపడుతూ నగరంలో సభలు–సమావేశాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని నిబంధనలు విధింపజేశాడు. ప్రభుత్వం విధించిన నిషేధాన్ని, నిబంధనలను ఉల్లంఘిస్తూ జమియత్–యే–నౌజవాన్–యే–తుల్బా సభ్యులు ముహమ్మద్ అబ్దుర్ రహమ్మాన్ రియాజ్, అమీర్ అహ్మద్, సయ్యద్ ఇబ్రాహీమ్, అబ్దుస్ సుభాన్, అతా హుస్సేన్‌లు 1920 మే 30న సభను నిర్వహించగా నిజాం ప్రభుత్వం వార్ని అరస్టు చేసి నగరం నుండి బహిష్కరించింది.

భారత జాతీయ కాంగ్రెస్ పిలుపు మేరకు అన్ని పోరాట రూపాలలో భాగ్యస్వాములు అవుతున్న ముస్లింలు సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా సాగిన మద్యపాన నిషేధ పోరాటంలో కూడా తమదైన పాత్రను నిర్వహించారు. గుంటూరు, నెల్లూరు, బళ్ళారి, అనంతపురం, కర్నూలు, ఉభయగోదావరి జిల్లాలోని ముస్లింలు ప్రజానీకం పెద్ద సంఖ్యలో, ఎంతో ఉత్సాహంతో మద్యపాన నిషేధోద్యమంలో పాల్గొన్నారు. ప్రధానంగా నెల్లూరు జిల్లాకు చెందిన సయ్యద్ మొహిసిన్ సాహెబ్, మహబూబ్ హుస్సేన్ సాహెబ్ మద్యపాన నిషేధ కార్యక్రమంలో క్రియాశీలక పాత్ర వహించారు. మహబూబ్ హుస్సేన్ సాహెబ్ అనర్గళంగా మాట్లాడటమే కాకుండా, ఉద్యమ గీతాలను మధురంగా పాడుతూ ఉద్యమ వ్యాప్తికి ఎంతగానో దోహద పడ్డారు. హైదరాబాదు రాష్ట్రంలోని బారువంచా గ్రామంలోని జాగీరుదార్లు కుహేష్ సాహెబ్, బుర్హాన్ సాహెబ్‌లు కల్లు, సారాలను విక్రయించవద్దంటూ, నిషేధాన్ని ప్రోత్సహించారు.

భారతావనిని కుదిపివేసిన ఖిలాఫత్–సహాయనిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాల సమయంలో ఆంధ్రలో మన్యం తిరుగుబాటు రంగం మీదకు వచ్చింది. 1922–24 మధ్యలో అల్లూరి సీరాతామరాజు నాయకత్వంలో జరిగిన ఈ ఉద్యమంలో డివిజనల్ మేజిస్ట్రేటుగా (డిప్యూటీ కలెక్టరు) పనిచేస్తున్న ఫజులుల్లాహ్ ఖాన్ రామరాజుకు ప్రేరణ, ప్రోత్సాహకారి మాత్రమే కాకుండా మన్యం విప్లవానికి

సారథ్యం వహించేంతగా రాజుకు తోడ్పాటు ఇచ్చారు. 1922 జులై 27న ఫజులుల్లాహ్ ఖాన్ ఆకస్మికంగా కన్నుమూయడంతో మన్యం విప్లవంలో ఆయన పాత్ర అసంపూర్ణంగా ముగిసింది. (మన్యంలో విప్లవం, పొన్నలూరి రాధాకృష్ణమూర్తి, ప్రజాప్రచురణలు, ఏలూరు, 1975)

మాతృభూమి మీద నుండి పరాయి పాలనను పారద్రోలాలంటే విదేశీ వస్తువుల వ్యామోహం వదలాలని, స్వదేశీ కుటీర పరిశ్రమలను అభివృద్ధిపర్చుకోవాలని మహాత్ముడు ఇచ్చిన ఆదేశాల మేరకు ఖద్దరు ఉద్యమం రూపుదిద్దుకుంది. ఈ ఉద్యమంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలిలో తొలిసారిగా ముహమ్మద్ ఇస్మాయిల్ 1926లో ఖద్దరు షాపు ప్రారంభించి చివరకు 'ఖద్దరు ఇస్మాయిల్' గా శ్యాశ్విత నామధేయులయ్యారు. ఈ తరహాలోనే నిరంతరం ఖద్దరు ధరించడమే కాకుండా ఖద్దరు విక్రయశాల ఉద్యోగిగా ఖద్దరు ప్రచారాన్ని నిర్వహించిన షేఖ్ ఖాసిం బేగ్ ఖద్దరు జుబ్బా ఖాశిం బేగ్‌గా గుర్తింపు పొందారు.

అటు నైజాం లోని హైదరాబాద్ నగరంలో ప్రముఖ జాతీయోద్యమకారిణి బేగం ఫఖ్రుల్ హాజియా స్వయంగా ఖద్దరు వస్త్రాలను ధరించడమే కాకుండా విదేశీ వస్తువుల భహిష్కరణలో పాల్గొని ట్రూప్ బజారులోని స్వగృహం 'ఆబిద్ మంజిల్' లో విదేశీ వస్త్రాలను అగ్గికి ఆహుతి ఇచ్చారు. ఆమె తనయుడు బద్రుల్ హసన్ బొంబాయి నుండి రాట్నాలు తెప్పించి, హైదరాబాద్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టారు. తిలక్ స్వరాజ్య నిధికి ఆయన 23 వేల రూపాయలు సేకరించి పంపారు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాక సందర్భంగా నిరసన తెలుపుతూ విదేశీ వస్తువులను తగలబెట్టిన తొలి వ్యక్తిగా బద్రుల్ హసన్ ఖ్యాతిగాంచారు. నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ముహమ్మద్ ఉస్మాన్ తన కర్మాగారంలోని విదేశీ బట్టలను పోగేసి తగలబెట్టారు.

బహుముఖంగా విస్తరిస్తున్న ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు అక్షరయోధులు అధికంగా శ్రమించారు. నగరంలోని నిజాం కళాశాలకు చెందిన గౌసుద్దీన్ అను విద్యార్థి హిందూ-ముస్లింల ఐక్యతకు సంబంధించి గ్రంథం ప్రచురించారు. గోషా మహల్ నివాసి ముహమ్మద్ జహూర్ అహమ్మద్ ఖాదీ ఉద్యమాన్ని బలపర్చుతూ రాసిన ఉత్తేజకరమైన వ్యాసాలు హైదరాబాదులోని ముషీర్-యే-దక్కన్, మదీనా ఉర్దూ పత్రికలో ప్రచురితమయ్యాయి.

ఈ కార్యక్రమంలో ఉద్యమం సాగుతుండగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని చౌరీచౌరా పోలీస్ స్టేషన్ విధ్వంసం, పోలీసు అధికారుల మీద దాడి సంఘటనతో గాంధీజీ ఉద్యమాన్ని ఉపసంహరించుకున్నారు. ఆ తరువాత క్రమంలో జాతీయోద్యమ వేదిక మీదకు వచ్చిన సైమన్ కమీషన్‌ను బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా మద్రాసులో షఫీ ముహమ్మద్ ప్రముఖ పాత్ర నిర్వహించారు. జాతీయోద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి యువజన-విధ్యార్థులను రంగం మీదకు తెచ్చేందుకు గుంటూరుకు చెందిన గాలిబ్ సాహెబ్, రహిమాన్‌లు అవిరళ కృషి సల్లారు. షేక్ గాలిబ్ సాహెబ్ బ్రాడీపేటలో ఆయన తన సోదరుని పేరిట నిర్వహించిన లాండ్రి షాపు ఆనాడు జాతీయ ఉద్యమకారులకు రహస్య కూడలి అయ్యింది. ఆ కారణంగా ఆ లాండ్రి మీద పలుమార్లు పోలీసులు దాడీ చేశారు.

ఈ మేరకు సంపూర్ణ స్వరాజ్యం సాధనకు అనుసరించాల్సిన ఉద్యమ వ్యూహాన్ని నిర్ణయించమని కాంగ్రెస్ గాంధీజీని కోరింది. సంపూర్ణ స్వరాజ్యం తమ లక్ష్యంగా ప్రకటించి ముందుకు సాగుతున్న

ఉద్యమాన్ని అడ్డుకోవడానికి బ్రిటీష్ వైస్రాయి ఇర్విన్ నిరంకుశంగా వ్యవహరించ సాగాడు. బ్రిటీష్ వైస్రాయి అప్రజాస్వామిక వ్యవహార సరళికి వ్యతిరేకంగా గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, జాతీయోద్యమంలో చిచ్చర పిడుగుగా ఖ్యాతి గడించిన హస్రత్ మొహానీ చే ప్రశావితులైన నగరానికి చెందిన రజియా బేగం, జమీలున్నీసా బాజీ, వారి అన్నదమ్ములు అన్వర్, జాఫర్‌లు ఉద్యమ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కుటుంబీకులందరూ స్వేఛ్ఛా-స్వాతంత్ర్యాలు, అన్నిరకాల అసమానతల నుండి ప్రజల విముక్తి కోరుతూ జాతీయోద్యమంలో పాల్గొనడమే కాకుండా, అటు సామ్రాజ్య విస్తరణకాంక్ష గల బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదురించడంతోపాటు, నిజాం వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్నారు.

బ్రిటీషు ప్రభుత్వ చట్టాల ఉల్లంఘన ద్వారా శాసనోల్లంఘన ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని నిర్ణయించుకున్న మహాత్మా గాంధీ 1930 మార్చి 20న గుజరాత్ లోని దండి యాత్ర ఆరంభించగానే మద్రాసులో జరిగిన శాసనోల్లంఘనలో ఉబేదుల్లాహ్ సాహెబ్ అరస్టు అయ్యారు. చిత్తూరు జిల్లా మదనపల్లె తాలూకా పెదపాలెం నివాసి షేక్ ఇమాం, ప్రకాశం జిల్లా, అమ్మనబ్రోలుకు చెందిన షేక్ చెంగీ షా కనపర్తిలోని ఉప్పు కొటారాల మీద జరిగిన దాడిలో పాల్గొన్నారు. బెహాంపూర్‌కు చెందిన రషీద్ ఖాన్, పశ్చిమ గోదావరికి చెందిన డాక్టర్ నశీర్ అహ్మద్ విదేశీ వస్తువుల బహిష్కరణ, మధ్యనిషేధం ఉద్యమంలో పాల్గొన్నారు. బెహాంపూర్‌కు చెందిన రషీద్ ఖాన్, పశ్చిమ గోదావరికి చెందిన డాక్టర్ నశీర్ అహ్మద్ విదేశీ వస్తువుల బహిష్కరణ, మద్యనిషేధం ఉద్యమంలో పాల్గొన్నారు. డాక్టర్ నశీర్ స్వగృహం వద్దే శాసనోల్లంఘన ఉద్యమ శిబిరం ఏర్పాటు చేశారు. జాతీయ కాంగ్రెస్ సభ్యులైన ఆయన ఆరు నెలల జైలు జీవితం గడిపారు. గుంటూరుకు చెందిన షేఖ్ గాలిబ్ సాహెబ్, నెల్లూరు జిల్లాలో యల్.ఫఖీర్, యం.షంషీర్ బేగ్ పలుమార్లు జైలుశిక్షలకు గురయ్యారు. ఈ సందర్భంగా భారత జాతీయ కాంగ్రెస్ ప్రచురించిన కరపత్రాలను పంచుతున్న నేరానికి అబ్దుర్రజ్జాక్, షేఖ్ మూసా సాహెబ్‌లు పోలీసుల దాడికి గురయ్యారు. చీరాల యువకుల ఆహ్వానం మేరకు వెళ్ళి ఉప్పుగుడారాలలోకి దూకిన ముహమ్మద్ గౌస్ దేవరంపాడు శిబిరానికి నాయకత్వం వహించారు.

1931లో గాంధీజీ-ఇర్విన్‌ల మధ్యన కుదిరిన ఒప్పందం తెచ్చిన ఉపశమనం అతి త్వరలో ముగిసింది. బ్రిటీషు ప్రభుత్వం జాతీయోద్యమాన్ని తీవ్రంగా అణిచివేయాలని నిర్ణయించి కిరాతక చట్టాలు రూపొందించగా మహాత్ముడు వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమాన్ని రూపొందించారు. ఈ పరిణామంతో రెచ్చిపోయిన అధికారగణం విజయవాడలోని ప్రతిష్టాకరమైన భారత జాతీయ కాంగ్రెస్ కార్యాలయం మీద కూడా పోలీసులు దాడులు నిర్వహించి కార్యాలయానికి తాళాలు వేశారు. ఈ చర్యను అవమానకరంగా భావించిన యువనాయకుడు సయ్యద్ హబీబుల్లాహ్ ముందుకు వచ్చి తన సహచరులతో కలసి 1932 జులై 31న కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు విఫల ప్రయత్నం చేశారు. ఈ సంఘటన పురస్కరించుకుని యువ నాయకుడు సయ్యద్ హబీబుల్లాహ్‌తోపాటుగా 70 మంది యువకులు అరస్టయ్యారు. (భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, విజయవాడ, 1984, పేజి. 92) ఈ సందర్భంగా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తెనాలి ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ మహబూబ్

ఆదం, ఆయన గురువు మంత్రవాది వెంకటరత్నంలు పోలీసుల కన్నుగప్పి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగారు.

1932 ఆగస్టు 17న ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును ప్రకటించింది. హరిజనులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సందర్భంగా గాంధీజీ జరిపిన హరిజన యాత్రలో భాగంగా 1933 డిసెంబరు 31న తిరుపతికి రాగ అక్కడ సి.ఎ.రహీం అను ఉత్సాహవంతుడైన యువకుడు అక్కడికక్కడ కాగితం మీద చేతి గోటితో మహాత్ముని చిత్రాన్ని చిత్రించి ఆయనకు బహూకరించారు.

ఆ తరువాత సంభవించిన వివిధ పరిణామాల వలన, సంపూర్ణ స్వరాజ్య సాధన లక్ష్యంగా ప్రారంభమైన శాసనోల్లంఘన ఉద్యమం బలహీనపడి 1934లో పూర్తిగా ముగిసింది. గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమాన్ని విరమించుకోవడం పట్ల యువకులు కిలక పాత్ర వహించిన మున్షీ ముహమ్మద్ మస్తాన్ (తెనాలీ) రహ్మతుల్లాహ్ (ఒంగోలు) విప్లవకర చర్యలకు పాల్పడ్డారు. విప్లవ కరపత్రాలను పంచడమే కాక, మంతెనవారి పాలెంలో రహస్యంగా నిర్వహించిన రాజకీయ తరగతులకు హాజరైన మన్షీ మస్తాన్ పోలీసుల చేత చావుదెబ్బలు తిన్నారు.

1939లో ఏర్పడిన హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ స్థాపనకు తోడ్పడిన పలు సంస్థలలో నిజాం సబ్జెక్టు లీగ్ కార్యకలాపాలలో అబుల్ హసన్ సయ్యద్ అలీ, బద్రుల్ హసన్, ఫజ్లుర్రహ్మాన్, సిరాజుల్ హసన్ తిర్మిజీ ప్రధాన పాత్ర నిర్వహించగా, ప్రముఖ జాతీయవాది బద్రుల్ హసన్ విదర్ హైదరాబాద్ అను గ్రంధాన్ని రాసి నిజాం సబ్జెక్టు లీగ్ భావాలను ప్రచారం చేయగా, నిజాం ప్రభుత్వం ఆ గ్రంధాన్ని నిషేధించింది. ఆ తరువాత ఏర్పడిన స్వదేశీ లీగ్‌కు నిజాం ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు ఫజ్లుర్రహ్మాన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. (హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర : వెల్దుర్తి మాణిక్యరావు). ఆ తరువాత ఏర్పడిన హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకులలో మౌల్వీ సిరాజుల్ హసన్ తిర్మిజీ ఒకరుగా ఖ్యాతిగాంచారు. ఆయనతోపాటుగా షేఖ్ నబీ సాహెబ్, షేఖ్ ముహియుద్దీన్ తదితరులు ప్రచార కార్యక్రమాలలో పాల్గొని చాలా కాలం నిజాం ప్రభుత్వం నిర్భంధనలో గడిపారు.

1939లో ద్వితియ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. సంపూర్ణ స్వరాజ్యం కోరుతుండగా బ్రిటీష్ పాలకులు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా, నాయకులతో ఏమాత్రం సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ద్వితియ ప్రపంచ యుద్ధంలో తమల్ని భాగ్యస్వాములను చేయడాన్ని సహించలేకపోయారు. ఆ నేపధ్యంలో 1940 అక్టోబరు 17న ఆచార్య వినోబా భావేను తొలి సత్యాగ్రహిగా అనుమతిస్తూ మహాత్ముడు చరిత్రకు వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన స్వర్ణకారుడు గుంతకల్ బాబా సాహెబ్ నెల్లూరు, అలీపూర్ జైలులో ఏడు మాసాలు శిక్షను అనుభవించారు. గుంతకల్ బాబా సాహెబ్‌గా ఖ్యాతిగాంచిన బాబా సాహెబ్ అనంతపురం జిల్లా కణేకల్లు నివాసి. ఆయన ఆనాటి ప్రముఖ నాయకులతో కలసి వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. హిందుపూర్ నివాసి టైలర్ పీర్ సాహెబ్ డిఫ్ఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ క్రింద మూడు మాసాలు, ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు చెందిన

టాంగా డ్రైవర్ షేక్ చెంగీ షా మూడు మాసాల కఠిన జైలుశిక్ష అనుభవించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం వ్యాపారి షేఖ్ అలీ సాహెబ్ తీవ్రమైన లాఠీచార్జీకి గురికావడమే కాకుండా నాలుగు మాసాల జైలు శిక్షకు గురయ్యారు. తణుకు తాలూకాకు చెందిన ముహమ్మద్ హుస్సేన్ వ్యక్తి సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొన్నారు. ఆకివీడు పరిసర గ్రామాలకు చెందిన ఉద్యమకారులు ముహమ్మద్ గౌస్, ముహమ్మద్ హుస్సేన్ తదితరులు ఆకివీడులో నివాసముంటున్న స్థానిక ప్రభుత్వ ప్రతినిధులైన కరణం, మనసబుల గృహాలకు వెళ్ళి ప్రభుత్వ రికార్డులను బైటికితెచ్చి కుప్పగా పోసి తగలబెట్టారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అబ్దుల్ మజీద్ ఖాన్ తదితరులను అరస్టు చేసి స్పృహ కోల్పోయేంత వరకు క్రూరంగా చితకబాదారు. ఆ తరువాత వీరందరికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రెండు వందల రూపాయల జరిమానా విధించడం జరిగింది. నరసాపూర్ నాయకులు షేఖ్ మీరా టెలిఫోన్ తీగలను తెంపి రిజిష్టరు ఆఫీసు వద్ద ప్రభుత్వ రికార్డులు దగ్ధం చేసిన సందర్భంగా లాఠీచార్జికి గురయ్యారు. తాడేపల్లి గూడెంకు చెందిన షేఖ్ పెద్ద మస్తాన్ రెండు సంవత్సరాలు జైలుశిక్షకు గురయ్యారు. షేఖ్ రహీం ఖాన్‌కు ఒక మాసం జైలు, 12 లాఠీ దెబ్బల శిక్ష విధించారు. కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన కొత్వాల్ అబ్బాస్ అలీ కుమారుడు ముహమ్మద్ హుస్సేన్ లాఠీచార్జీలో తీవ్రంగా గాయపడ్డారు. కొనకంచి నివాసి షేఖ్ సర్దార్ సాహెబ్‌కు కోర్టు ముగిసే వరకు శిక్ష పడింది. అయినా ఆయన మళ్ళీ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఈ విధంగా అనేక సంఘటనల్లో పలువురికి కఠిన శిక్షలు పడ్డాయి.

కర్నూల్ జిల్లా పాణ్యంకు చెందిన షంషీర్ బేగ్‌కు ఆరు మాసాల జైలు, 500 జరిమానా లేక మూడు మాసాల జైలు శిష విధించారు. జరిమానా కట్టడానికి ఆయన నిరాకరించారు. జరిమానా కడితే తాను చేసిన పనిని నేరంగా అంగీకరించటమేనని భావించిన ఆయన జరిమానా కట్టకుండా అదనంగా మూడు మాసాల జైలు జీవితం గడిపారు. నంద్యాల–పాణ్యం మధ్యన రైల్లే లైనుకు ఫిష్ ప్లేట్లు తొలగించినందుకు గాను షంషీర్ బేగ్, ముల్లా, మహ్‌బూబ్ సాహెబ్‌లు ఏడాది జైలుశిక్షను అనుభవించారు. షంషీర్ బేగ్ ఆతరువాత కూడా ఉద్యమంలో నిర్విఘ్నంగా పాల్గొన్నారు. స్వతంత్ర భారతంలో రెండుసార్లు లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికయ్యారు. కడపజిల్లా పులివెందల తాలూకా పైడిపాలెం గ్రామానికి చెందిన సామాన్య రైతు దూదేకుల హుస్సేన్ సాహెబ్ రెండు మాసాలు దారుణమైన జైలు జీవితాన్ని రుచి చూశారు. కదిరికి చెందిన యస్. ఖాజా ముహియుద్దీన్ సాహెబ్ పలు ప్రదర్శనలు నిర్వహించి, ఆ ప్రదర్శనలలో బ్రిటీష్ ప్రభుత్వ దుర్మార్గాలను బహిరంగ పర్చుతూ ప్రజలను ఉద్యమ బాటన నడవాల్సిందిగా ప్రోత్సహిస్తూ ముందుకుసాగి శిక్షలను అనుభవించారు.

కడప జిల్లా కొండపసూర్ గ్రామస్తులు షేఖ్ నబీ రసూల్ గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితమై, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఆయన మూడుమాసాల జైలు శిక్షను రుచిచూడాల్సి వచ్చింది. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొనడాన్ని స్వగ్రామం వద్దంటున్నా ఆయన ధైర్యంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా కడప కోటిరెడ్డి సహచరుడు డీ. హుస్సేన్ సాహెబ్ రెండు మాసాల శిక్షకు గురి కాగా, షేఖ్ ముహమ్మద్ సాహెబ్ అఖిల భారత ముస్లిం లీగ్ రాజకీయాలతో ప్రభావితులైన

ముస్లింలను కాదంటూ జాతీయోద్యమ పోరాట కార్యక్రమాలలో పాల్గొని ప్రముఖ పాత్రను నిర్వహించారు.

జాతీయోద్యమంలో భాగంగా యుద్ధ వ్యతిరేక ప్రచారంలో పాల్గొంటున్న కొండ అప్పాపురం నివాసి టైలర్ షేక్ నబీ రసూల్ సాహెబ్ మూడు మాసాలు, గుంటూరుకు చెందిన సయ్యద్ జానీ సాహెబ్, నరసరావుపేట జైలులో నెల రోజులపాటు శిక్షను అనుభవించారు. షేఖ్ గాలిబ్ సాహెబ్, షేఖ్ అలీలు అరస్టయ్యారు. యుద్ధ వ్యతిరేక నినాదాలు చేసినందుకు వెంకటగిరి నివాసి షేఖ్ చబీ సాహెబ్‌కు కోర్టు ముగిసేవరకు నిలబడాల్సిందిగా న్యాయస్థానం శిక్ష విధించింది. అనంతపురం జిల్లా చియ్యడు గ్రామానికి చెందిన రజియాబి భర్త ముహియుద్దీన్ సాహెబ్‌తో కలసి వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని చరిత్ర సృష్టించింది. ఆంధ్రావనిలో ఒక ముస్లిం మహిళ వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమంలో బహిరంగంగా ప్రత్యక్షంగా పాల్గొనడం ఇదే ప్రధమమని పలువురు శ్లాఘించారు. జాతీయేద్యమకారుడైన భర్త ముహియుద్దీన్ సాహెబ్ ఆమెను ప్రోత్సహించడంతో, రజియాబి మరింత ఉత్సాహంతో యుద్ధ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆనాడు సాగిన యుద్ధ వ్యతిరేక బహిరంగ ప్రదర్శనలో రజియాబి స్వయంగా పాల్గొనటమే కాక యుద్ధ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆనాడు సాగిన యుద్ధ వ్యతిరేక నినాదాలిచ్చి పలువుర్ని ఆశ్చర్యచకితులను చేశారు.

1941 జనవరిలో జర్మనీ, జపాన్‌ల సహకారంతో బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించాలని భావించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశం నుండి అదృశ్యమయ్యారు. ఆ ప్రయత్నంలో ఆయనకు మియా అక్బర్ షా సహకరించారు. బ్రిటీష్ ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించి అంతరాష్ట్రీయ మద్దతు కూడగట్టేందుకు నేతాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ పరిస్థితులతో ఆందోళనకు గురైన ఆంగ్ల ప్రభుత్వం 1940–41లో జాతీయ ఉద్యమకారులను విడుదల చేసి, ప్రజల మీద నిర్బంధాలను, నిషేధాలను కొంతమేరకు సడలించింది. జాతీయోద్యమ నాయకులతో రాయబారం జరపడానికి 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ భారత దేశం వచ్చాడు. క్రిప్స్ ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేనందున, భారతీయ నాయకత్వం అంగీకరించలేదు. క్రిప్స్ రాయబారం విఫలమైంది. 1942 జులైలో మహాత్ముడు ఇది బాహాటమైన తిరుగుబాటు అని హెచ్చరిక చేశారు. 1942 ఆగస్టులో బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, క్విట్ ఇండియా పోరాటానికి సమర శంఖారావం పూరించింది. బ్రిటీష్ వారిని భరతదేశం వదిలి పొమ్మంటూ 1942 జులైలో వార్ధాలో చేసిన తీర్మానాన్ని, బొంబాయి సమావేశం ధృవీకరించింది. ఆ తీర్మానం క్విట్ ఇండియా తీర్మానంగా ప్రసిద్ధి పొందింది. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి గాంధీజీ మాట్లాడుతూ విజయమో–వీరస్వర్గమో తేల్చుకోవాలన్నారు.

జాతీయ నాయకుల పిలుపు మేరకు జనసమూహాలు కూడా కదిలాయి. ప్రభుత్వం ప్రజల మీద విరుచుకుపడింది. ఈ క్రమంలో, అనంతపురం జిల్లా కదిరి నివాసి మహబూబ్ సాహెబ్ కొత్తకోట అటవీ శాఖ కార్యాలయాన్ని తగుల బెట్టినందుకు జైలుకు వెళ్ళారు. అనంతపురం జిల్లాకు చెందిన యం. ముహియుద్దీన్ సాహెబ్, యం. అఫ్సర్ అలీ, తదితరులు మధ్యం వ్యాపారుల బెదిరింపులకు లొంగకుండా మద్యనిషేధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆనాడు ముహమ్మద్ అలీ జిన్నాతో వ్యక్తిగత

పరిచయం ఉన్న వ్యక్తిగా ప్రశిద్ధుడైన ముహమ్మద్ అలీ ముస్లిం లీగ్ రాజకీయాలకు దూరమై ఈ పోరాటంలో పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన వ్యవసాయదారుడు అబ్దుల్ మజీద్ ఖాన్ ఒకటిన్నర సంవత్సరం జైలుశిక్షను అనుభవించారు. ఆ తరువాత అతి చిన్నవయస్సులోనే జిల్లా బోర్డు సభ్యునిగా ఎన్నికైన ఆయన చరిత్ర సృష్టించారు. భీమవరం వ్యాపారి షేఖ్ అలీ సాహెబ్ క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయానికి నిప్పుపెట్టారు. ఆ సందర్భంగా జరిగిన లాఠీ ఛార్జిలో తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరువాత కూడా బ్రిటీష్ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న ఆయన పలుమార్లు జైలు శిషలకు గురయ్యారు.అలీపూర్ క్యాంపులో రెండు సంవత్సరాల పాటు పలు కడగండ్లు అనుభవించారు. భీమవరం నివాసి షేఖ్ ఫఖీర్ ముహమ్మద్ 17-8-1942 నాటి జాతీయోద్యమ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు జైలుశిక్ష, ఎనిమిది కొరడా దెబ్బల శిక్షకు గురయ్యారు. ఆయన 1943 డిసెంబరు 9 వరకు అలీపూర్ జైలులో గడిపారు. తాడేపల్లిగూడెం తాలూకా నవాబుపాలెం రైల్వే గేట్‌మన్ షేఖ్ పెద్ద మస్తాన్ సంవత్సరం పాటు అలీపూర్ క్యాంపు జైలు బాధలను రుచి చూశారు. తాడేపల్లిగూడెం నివాసి షేఖ్ రహీంఖాన్ పెంటపాడు తపాల కార్యాలయం తగలబెట్టిన సంఘటనలో ప్రధాన పాత్ర వహించినందుకు 12 కొరడా దెబ్బల శిక్షను అనుభవించారు.

కృష్ణాజిల్లా తిరువూరు తాలూకా గౌరంపాలెం నివాసి సాలార్ సాహెబ్, స్వాతంత్ర్య సమర యోధుడు కొత్వాల్ అబ్బాస్ అలీ కుమారుడు కొత్వాల్ ముహమ్మద్ హుస్సేన్ పోలీసుల నిర్భందానికి గురయ్యారు, నూజివీడుకు చెందిన షేఖ్ నూరుల్లాహ్ సాహెబ్, కొనకంచి నివాసి షేఖ్ సర్దార్ సాహెబ్ వ్యక్తి సత్యాగ్రహం నుండి క్విట్ ఇండియా ఉద్యమం వరకు నిరంతరం కార్యక్రమాలలో పాల్గొన్నారు. నందిగామ తాలూకా కొనకంచి గ్రామాధికారి షేఖ్ బికారీ సాహెబ్ ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున కిరాతక వైఖరికి నిరసనగా ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆలూరు తాలూకా నెమకల్‌కు చెందిన టైలర్ యం. అక్బర్ అలీ ఎనిమిది మాసాల జైలు శిక్షకు గురయ్యారు. అనంతపురం జిల్లా కసాపురం నివాసి ముహమ్మద్ రసూల్ గుంతకల్ వద్ద రైల్వేస్టేషన్ ధ్వంసం చేసిన సంఘటనలో మిత్రులతో కలసి పాల్గొన్నందుకు ఆరు మాసాల జైలు శక్షను అనుభవించారు. మదనపల్లె నివాసి పి. మదార్ సాహెబ్ పోలీసు లాఠీ దెబ్బలకు గురయ్యారు. నంద్యాల తాలూకా తొగిరిచేడుకు చెందిన రైతుకూలీ ముల్లా ముహమ్మద్ సుభాని అలీపూర్‌జైలులో ఆరు మాసాల జైలు శిక్ష అనుభవించారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన షేఖ్ ముహియుద్దీన్ సాహెబ్ నిర్భందానికి గురయ్యారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన టైలర్ షేఖ్ హటల్ సాహెబ్‌ను అరెస్టు చేసి డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ క్రింద 18 మాసాల శిక్షను విధించారు. నిడుబ్రోలుకు చెందిన షేఖ్ మస్తాన్ క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖంగా పాల్గొన్నారు. ఆయనకు ప్రభుత్వం మూడు సంవత్సరాల ఆరు మాసాల జైలుశిక్ష విధించింది. బస్ కండక్టర్ ముహమ్మద్ హనీఫ్ అలీపూర్, రాజమండ్రి జైళ్ళలో సంవత్సరం గడిపారు. తెనాలికి చెందిన మున్షీ సయ్యద్ ముహమ్మద్ మస్తాన్ తెనాలి రైల్వే స్టేషన్ మీద జరిగిన దాడిలో పాల్గొని, అక్కడ జరిగిన పోలీసు కాల్పుల్లో చావు తప్పి

బయటపడ్డారు. ఆ తరువాత కొంత కాలం రహస్య జీవితం గడిపారు. తెనాలికి చెందిన మరో యోధుడు సయ్యద్ అబ్దుల్ అజీమ్ ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొనడమే కాక, మద్రాసులో కొంతకాలం అజ్ఞాతవాసం చేశారు.

ముస్లింల సంక్షేమం, రాజాధికారం ప్రధాన లక్ష్యంగా అఖిల భారత ముస్లింలీగ్ మద్రాసు నగరవాసుల గుప్పెట నుండి బయట పడి గుంటూరు జిల్లా కేంద్రం బాగా బలపడింది. 1944 మే 5న తెనాలిలో సయ్యద్ మహ్‌బూబ్ నాయకత్వంలో ముస్లింలీగ్ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రముఖ న్యాయవాది ముహమ్మద్ అబ్దుస్సలామ్ అధ్యక్షత వహించగా సయ్యద్ మహ్‌బూబ్, ముహమ్మద్ యాసీన్, అబ్దుల్ కరీం, అల్లాబక్ష్ లాంటి ప్రముఖులు సభ్యులుగా ముస్లింలీగ్ జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ ఎన్నికయ్యింది. 1945 జనవరి 21న బాపట్లలో గుంటూరు జిల్లా ప్రైమరి లీగ్ అధ్యక్ష కార్యదర్శుల ప్రథమ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవి ఉమర్ అలీ షాహ్ మాట్లాడుతూ "మన దేశంలో కాంగ్రెస్, ముస్లిం లీగ్ రెండు పెద్ద పెద్ద రాజకీయ సంస్థలు. రెండు ఏకమైతేనేగాని పరదేశ పాలక వర్గాన్ని తరుమలేము. హిందూ-ముస్లిం తగాదాలు, పోరాటాలు విదేశీ పాలకులను ఇక్కడే శాస్వతంగా అట్టి పెట్టగలవు. ఈ సత్యాన్ని ఉభయులు గ్రహించాలని" ఉద్భోదించారు. అఖిల భారత ముస్లిం లీగ్ రాజకీయ దృక్పదం ఎలా ఉన్నా ఆంధ్రలోని ముస్లింలలో అత్యధికుల రాజకీయ దృక్కోణం మాత్రం భిన్నంగా వ్యక్తము అయ్యింది. ఆయన మార్గ నిర్దేశకంలో ముస్లిం లీగ్ పాకిస్థాన్ కొరకే కాకుండా ముస్లిం ప్రజలకు నిత్యం సహాయ సహకారిగా నిరూపించాలి, అని స్పష్టంగా ప్రకటించింది. ఈ కార్యక్రమాలలో అజీజుల్లాహ్ దుర్రాని (ఇంగ్లాండ్), అబ్దుల్ మన్నాన్ దుర్రానీ (అలీగఢ్), డాక్టర్ ముహమ్మద్ బేగ్, ఎం.ఈ. ఏ సలామ్, షేఖ్ మఖ్‌దూమ్, యస్. మహ్‌బూబ్‌లు పాల్గొన్నారు.

బ్రిటీష్ దాస్య శృంఖాలాల నుండి విముక్తం చేయడానికి జర్మనీ వెళ్ళిన సుభాష్ చంద్ర బోస్ అటు నుండి బర్మా చేరుకుని కెప్టెన్ మాన్ సింగ్ నేతృత్వంలోని భారత ఆజాద్ హింద్ ఫౌజ్ పగ్గాలను సుభాష్ చంద్ర బోస్ స్వీకరించారు. ఆయన నేతృత్వంలో భారత జాతీయ సైన్యం, స్వతంత్ర భారత ప్రభుత్వం ఏర్పడింది. ఇటు సైన్యంలో అటు ప్రభుత్వంలో ముస్లిం యోధులు, మేధావులు నేతాజీ సన్నిహితంగా ఉంటూ అండదండలు అందించారు. ఈ క్రమంలో హైదరాబాదుకు చెందిన ఆబిద్ హసన్ సఫ్రానీ లాంటి వారు ఉన్నత స్థానాలలో బాధ్యతలు స్వీకరించగా ఖమ్రుల్ ఇస్లాం, తాజుద్దీన్ గౌస్, హైదరాబాద్ చార్మినార్ సిగరెట్ కంపెనీ (మాజీ సుల్తాన్ టొబాకో కంపెనీ) యజమాని కుమారుడు అలీ సుల్తాన్ కూడా నేతాజీతో కలసి పనిచేశారు. ఈ మేరకు హైదరాబాదు సంస్థానానికి చెందిన షరీఫుద్దీన్, అబ్దుల్ సయ్యీద్ ఉస్మానీ, అబ్దుల్ లతీఫ్, ఇమాముద్దీన్, ముహమ్మద్ ఖాన్ లాంటి పలువురు నేతాజీ వెంట నడిచారు. ఈ యోధులలో ఆబిద్ హసన్ సఫ్రానీ లాంటి వారు స్వాతంత్ర పోరాట సాహిత్య చరిత్రలో అపూర్వం అనదగిన "జైహింద్", "నేతాజీ" అను పదాలను సృష్టించారు. విజయనగరం జిల్లా వేపాడు గ్రామానికి చెందిన షేఖ్ ఖాదర్ ముహియుద్దీన్ చిన్నతనంలోనే పనికోసం బర్మాకు వెళ్ళి అక్కడి తేయాకు తోటల్లో శ్రమిస్తూ దాచుకున్న 20 వేల రూపాయలను ఆజాద్ హింద్ ఫౌజ్‌కు విరాళంగా సమర్పించి తాను కూడా ఆజాద్ హింద్

ఫౌజ్‌లో రైఫిల్‌మన్‌గా, రిక్రూటింగ్ ఏజెంటుగా కూడా ఎంతో కృషిచేశారు.

చిత్తూరు జిల్లా చంద్రగిరికి చెందిన యస్. అబ్దుల్ అలీ నేతాజీ పిలుపుకు ప్రభావితుడై ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. వృత్తిరిత్యా వడ్రంగి కావడంతో ఆయనకు క్యాంప్ క్వార్టర్లలో చేతినిండా పనిఉండేది. అయినా అలుపు సొలుపు ఎరుగకుండా పనిచేస్తూ ఆయన అధికారుల ప్రశంసలను అందుకున్నారు. అనంతర కాలంలో ఆయన యుద్ధ ఖైదీగా సంవత్సరం పాటు జైలు శిక్షను అనుభవించారు. అబ్దుల్ అలీ లీగ్ చిత్తూరు జిల్లాకు చెందిన ముహమ్మద్ అఫ్జల్ సాహెబ్ నేతాజీ సైన్యంలో చేరారు. ఆయన కూడా ఒక ఏడాది యుద్ధఖైదీగా నిర్బంధానికి, ఇబ్బందులకు గురయ్యారు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన పిఈ పిఈ ముహమ్మద్ ఇబ్రాహీమ్ అదే బాటలో నడిచారు. కడపజిల్లా రాయచోటికి చెందిన డ్రైవర్ అబ్దుల్ ఖాదర్ ద్వితియ ప్రపంచ యుద్ధ కాలంలో భారత జాతీయ సైన్యంలో చేరారు. 1945 దాకా మలయా తదితర ప్రాంతాలలో జైలులో గడిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన షేఖ్ అహ్మద్ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో భాగ్యస్వాములయ్యారు. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో పాల్గొని ఆయన పలు శిక్షలకు గురయ్యారు.

అంతర్జాతీయ పరిణామాల దృష్ట్య, జాతీయంగా భారతీయులు నిర్వహిస్తున్న ఉద్యమాల తీవ్రత ఫలితంగా 1947లో భారతదేశం పాలనాధికారాన్ని భారతీయులకు అప్పగించాల్సిన పరిస్థితి ఆంగ్లేయులకు ఏర్పడింది. 1940 నుండి పాకిస్థాన్ ఏర్పాటును కోరుతూ ఆల్ ఇండియా ముస్లిం లీగ్ సాగించిన విభజన రాజకీయాలకు ఆంగ్లేయులు తోడ్పాటు అందించారు. ఈ విభజన ప్రయత్నాలకు తెలుగు గడ్డ మీద నుండి తెనాలికి చెందిన మున్షీ మస్తాన్, నర్సరావుపేటకు చెందిన షేఖ్ ముహమ్మద్ అలీ, షేఖ్ ముహియుద్దీన్ సాహెబ్‌లు లీగ్ విభజన రాజకీయాలను నిరసించారు. ముహమ్మద్ అలీ ఎంతో కాలంగా లీగ్ సభ్యునిగా ఉన్నా కూడా, లీగ్ విభజన రాజకీయాలను వ్యతిరేకిస్తూ లీగ్‌కు రాజీనామా చేశారు. నరసరావుపేటకు చెందిన సయ్యద్ జాన్ అహ్మద్ విభజనను వ్యతిరేకిస్తూ పనిచేశారు. భారత విభజన వలన కలిగే నష్టాలను, కష్టాలను వివరిస్తూ సభలు, సమావేశాలు నిర్వహించారు, విభజనను పూర్తిగా వ్యతిరేకించారు. ఈ మేరకు విభజనకు వ్యతిరేకంగా ప్రజలు, నాయకులు ఎంతగా ప్రయత్నించినా చివరకు విభజన తప్పలేదు. 1947 జులై 15న బ్రిటీష్ పార్లమెంట్ భారత స్వాతంత్ర్య ప్రదాన బిల్లును ఆమోదించింది.

ఈ ప్రకటన బ్రిటీష్ ప్రసిడెన్సీ ఏరియాలో ఆంధ్ర ప్రాంతానికి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తెచ్చిపెట్టింది కాని, నిజాం నవాబు తన ఆధీనంలోనున్న హైదరాబాదు సంస్థానం స్వతంత్రంగా ఉ ంటుందని ఆగస్టు 14న ఆజాద్ హైదరాబాదు ను ప్రకటించాడు. ఈ ప్రకటనతో విలీనోద్యమం ఆరంభమైంది. జాతీయ ముస్లిం సమితి కార్యదర్శి అబ్దుల్ ఘనీ నిజాం ప్రకటన మీద స్పందిస్తూ ఇది వట్టి అవివేకం. అందరాని ఫలానికై ఆశించడం తప్ప మరొకటి కాదు. బ్రిటీషు పార్లమెంటు సభ్యులకు భారతదేశ వ్యవహారాలలో జోక్యం కలిగించుకునే అధికారం అణుమాత్రమైనా లేదని గ్రహించకపోవడం మిగులు శోచనీయం అని అన్నారు. (హైరదాబాద్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, వెల్దుర్తి మాణిక్యరావు, పేజి. 478) ఆ క్రమంలో సిరాజుల్ హసన్ తిర్మిజీ, డాక్టర్ అక్బర్ అలీ,

జలాలుద్దీన్, హసన్ ముహమ్మద్ హైల్వాన్, మీర్ అహ్మద్ అలీ ఖాన్, డాక్టర్ లతీఫ్ సయ్యద్ విలీనోద్యమంలో భాగ్యస్వాములయ్యారు. కమ్యూనిస్టు పార్టీలో భాగ్యస్వాములైన మఖ్దూమ్ ముహియుద్దీన్, అలం ఖంద్ మీర్, హసన్ నాసిర్, జవ్వాద్ రిజ్వీ, అఖ్తర్ హుస్సేన్, జహందర్ అఫ్సర్, కుతుబే ఆలం, అహ్సన్ అలీ మిర్జా, మేరాజ్ హైదర్ హుస్సేన్, హుసైనీ షాహిద్ లాంటి వివిధ రంగాలలో ప్రతిభావంతులైన ప్రముఖులు నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలు ఉర్దూ పత్రికలు విలీనోద్యమాన్ని సమర్థిస్తూ ముందుకు వచ్చాయి. ఈ మార్గాన మరింత సాహసంగా ముందుకు సాగిన వ్యక్తి ఇంరోజ్ ఉర్దూ పత్రిక సంపాదకులు షొయేబుల్లా ఖాన్, ప్రముఖ ఉర్దూ పండితులు ఖాజీ అబ్దుల్ గఫ్ఫార్ పయం ప్రధాన పాత్ర నిర్వహించాయి.

ఇండియన్ యూనియన్ లో నిజాం సంస్థానాన్ని విలీనం చేయాల్సిందిగా నిజాం నవాబును కోరుతూ, హైదరాబాద్ రాష్ట్రంలో ఏర్పడిన అవాంఛనీయ పరిస్థితులను పూసగుచ్చినట్లు ఏకరువు పెడుతూ, నిజాం ప్రభుత్వంలో సూబేదార్‌గా బాధ్యతలు నిర్వహించిన నవాబ్ మంజూర్ జంగ్, నిజాం ప్రభుత్వంలో విద్యాశాఖ సంచాలకులుగా పనిచేస్తున్న ముహమ్మద్ హుస్సేన్ జాఫరీ, తహసీల్‌దార్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ఫరీద్ మిర్జా, బాఖర్ అలీ మిర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, అహ్మద్ మిర్జా, హుస్సేన్ అబ్దుల్ మున్ఇమ్‌లు సంతకాలు చేశారు. ఆ తరువాత దువ్వ డిప్యూటీ కలెక్టరుగా నైజాం ప్రభుత్వం నుండి ఉపకార వేతనం పొందుతున్న ఫాయిక్ హుస్సేన్ కూడా ఆ లేఖలో వ్యక్తం చేసిన అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తూ, తదుపరి సంభవించే తీవ్ర పరిణామాలను కూడా ఆలోచించకుండా లేఖ మీద సంతకం చేశారు. ఈ లేఖ ప్రాంతీయంగా, జాతీయంగా, అంర్జాతీయంగా చరిత్ర సృష్టించింది. ఈ లేఖ పూర్తి పాఠం విఖ్యాత జాతీయవాది ఖాజీ అబ్దుల్ గఫ్ఫార్ సంపాదకత్వం లోని ఉర్దూ పత్రిక పయాం, 1948 ఆగస్టు 13 నాటి సంచికలో ప్రకటితమైంది.

ఆ వాతావరణంలో ప్రజలు విలీనం కోరుతూ ప్రముఖ కవి మఖ్దూమ్ ముహియుద్దీన్ ప్రముఖ పాత్ర వహించారు. ఈ ఉద్యమాలకు సిరాజుల్ హసన్ తిర్మిజీ, డాక్టర్ అక్బర్ అలీ, జాలాలుద్దీన్, హసన్ అహమ్మద్ ఫైల్వాన్, మీర్ అహ్మద్ అలీ ఖాన్ డాక్టర్ లతీఫ్ సయూద్, నవాబ్ కమాల్ యార్ జంగ్, నవాబ్ యూసుఫ్ అలీ ఖాన్ సాలార్ జంగ్, సయ్యద్ ఆలం ఖుంద్ మీర్, ఖాజీ అబ్దుల్ గఫ్ఫార్, అఖ్తర్ హుస్సేన్, జవ్వాదీ రిజ్వీ లాంటి ప్రముఖులు విలీనం డిమాండును సమర్థించారు. ఈ పోరాటంలో భాగంగా సాగిన ఆందోళనలో విద్యార్థి నాయకులు జాకిర్ అలీ మిర్జా అరెస్టయ్యారు. ఆయనను చాలా కాలం గృహ నిర్బంధనలో ఉంచారు.

అటు ఆజాద్ హైదరాబాదును కలగంటున్న నిజాం నవాబు ఇండియన్ యూనియన్‌లో నైజాంను విలీనం చేయడానికి ససేమిరా అంటుండగా నైజాం సంస్థాన సరిహద్దుల్లో గల ప్రాంతాలు ఒక్కొక్కటిగా స్వతంత్ర రిపబ్లిక్‌గా ప్రకటించుకోవడం ఆరంభించాయి. ఆ ప్రయత్నాలలో కృష్ణాజిల్లాలో గల పరిటాక గ్రామం రిపబ్లిక్‌ను ప్రకటించుకుంది. ఆ గ్రామానికి చెందిన యువకుడు షేఖ్ మౌలా సాహెబ్ దూర్‌హటో దునియావాలో హిందుస్థాన్ హమారా హై అంటూ జాతీయ పతాకాన్ని

పరిటా కచ్చేరి మీద ఎగురవేసి సంచలనం సృష్టించారు. ఈ చర్యకు మూడు సంవత్సరాల కఠిన శిక్ష ఉన్నపటికీ మౌలా సాహెబ్ ఏమాత్రం భయపడకుండా పరిటాల పోరాటంలో చివరి వరకు నిలిచారు.

ఆనాటి పోరాటంలో పాల్గొన్న పలువురిలో వరంగల్‌కు చెందిన అబ్బాస్ అలీ హైదరాబాదులో నాలుగు మాసాలు జైలు శిక్షను అనుభవించారు. గన్నవరం నివాసి నాసిర్ ముహమ్మద్ ఐదు మాసాలు, ఖమ్మం తాలూకా మధిరకు చెందిన ఖాదర్ బేగ్ రెండు మాసాలు, ఖమ్మం జిల్లా ఎడ్లపల్లి రైతు ఇనగాని ఖాసిం రెండు మాసాలు, అదసర్ల నివాసి షేఖ్ బాబు రెండు మాసాలు, జైలు శిక్షను అనుభవించారు. 1946లో నైజాం సేనలు ఖమ్మంకు చేందిన ముహమ్మద్ రజబ్ అలీని అరస్టు చేసి మూడు మాసాలుపాటు నిర్బందనలో ఉంచాయి. స్వతంత్ర భారతంలో ఆయన పలుమార్లు శాసన సభ్యునిగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. ఆనాడు విలీనం కోరుతూ సాగిన ప్రజాపోరులో కొంత మంది మహిళలు కూడా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వాతంత్ర్య సమరయోధుల గ్రంధంలో ఒకే ఒక్క ముస్లిం మహిళ పేరుంది. ఆమె నఫీస్ ఆయిషా బేగం. హైదరాబాదు నివాసి. ఆమె తండ్రి పేరు హమీద్ అలీ ఖాన్. నైజాం సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని సాగిన ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు.

నైజాం సంస్థానాధీశుని రాజకీయాలను, రజాకార్లు జరుపుతున్న చర్యలను వ్యతిరేకిస్తూ ప్రముఖ జర్నలిస్టు షొయేబుల్లాఖాన్ తాను సంపాదకత్వం వహిస్తున్న ఉర్దూ పత్రిక ఇమ్రోజ్‌లో వ్యాసాలు వ్రాసారు. ఆ కారణంగా రజాకారుల ఆగ్రహానికి గురైన ఆయనను 1948 ఆగష్టు 21 రాత్రి హైదరాబాద్ నడిబొడ్డున దారుణంగా హత్యకు గురయ్యారు. ఆయన సహచరుడు ముహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ ఈ సందర్భంగా చేతిని కోల్పోయారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న డిల్లీ అఖ్‌బార్ పత్రిక సంపాదకులు ముహమ్మద్ బాఖర్ ఆంగ్ల సైన్యాధికారుల చేతుల్లో చిత్రహింసలకు గురై కాల్చివేయబడ్డారు. స్వాతంత్ర్య సమరంలో పాల్గొని పాలకులచే కాల్చివేతకు గురైన ప్రప్రథమ జర్నలిస్టుగా ఆయన ఖ్యాతి గడించారు. భారత స్వాతంత్ర్యపోరాటపు చివరి దశలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం రాజీ లేని పోరాటం సాగిస్తూ, హత్యకు గురైన అక్షర యోధునిగా, ఇమ్రోజ్ సంపాదకులు షొయేబుల్లాఖాన్ చిరస్మరణీయమైన ఖ్యాతి పొందారు.

ఆ తరువాత స్వాతంత్ర్యోద్యమం స్ఫూర్తితో సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో కూడా ముస్లిం ప్రజానికం తమ హిందూ సోదరులతో కలసి సాగారు. జనగామ తాలూకా దేవరుప్పల శివారు గ్రామం కామారెడ్డిగూడెంకు చెందిన షేఖ్ బందగీ సాహెబ్ తన న్యాయమైన హక్కుల కోసం నిజాం సంస్థానంలోని విస్నూరు దేశ్‌ప్రముఖ్ రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా పోరాడి చరిత్ర సృష్టించారు. ఆ అవమానాన్ని భరించలేకపోయిన భూస్వామి రామచంద్రా రెడ్డి 1940జులై 26న బందగీని హత్య చేశారు. దామచర్ల మండలానికి చెందిన షేఖ్ నన్నే బచ్చా లాంటి యోధులు తుపాకులు చేతబట్టి నిజాం రజాకార్లను, పోలీసులను సాయుధంగా ఎదురుకున్నారు. ఈ సందర్భంగా పలు కష్టనష్టాలను ఎదుర్కొనటమే కాకుండా చిత్రహింసలను, భయానక జైలు జీవితాలను రుచి చూశారు. ఈ పోరాటంలో ముస్లిం స్త్రీలు కూడా ఏమాత్రం వెనుకంజ వేయలేదు. నగరాలులో

నివశించే రజియా బేగం, జమాలున్నీసా బేగం లాంటి వారితోపాటుగా తెలంగాణలోని రాజారం గ్రామానికి చెందిన జైనా బీ లాంటి మహిళలు కూడా ఏమాత్రం భయపడకుండా, ప్రాణత్యాగాలకు సిద్ధపడి పోరుబాటన నడచి చరిత్రకు కారణమయ్యారు.

1948 జూన్ 21న మౌంట్‌బాటన్ పదవీ విరమణ చేసి ఇంగ్లాండు వెళ్ళిపోయారు. మౌంట్‌బాటన్ నిష్క్రమణతో నైజాం పాలకుడు బలహీనుడయ్యాడు. జాతీయంగా, అంతర్జాతీయంగా పరిస్థితులు నిజాంకు అనుకూలించలేదు. ఈ ప్రతికూల పరిస్థితులలో ఉక్రోషం పట్టలేక రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల దుండగులు దండు మరింతగా విజృంభించగా 1948 సెప్టెంబర్ 13న తెల్లవార ఝామున నైజాం సంస్థానం పై భారత సైన్యం ముప్పేట దాడి ఆరంభించింది. ఈ చర్యలో పాల్గొన్నది భారత సైన్యం అయినప్పటికీ అది పఉఓలీసు చరదయ అని ఆనాటి గవర్నర్ జనరల్ సి. రాజగోపాలచారి వర్ణించడంతో అదికాస్తా పోలీసు చర్య స్థిరపడింది. ఈ పోలీసు చర్యలో హిందూ-ముస్లి తేడా లేకుండా ప్రజలంతా బాధలకు గురయ్యారు. ప్రధానంగా అమాయక ముస్లింలు చాలా ఇక్కట్లు పడ్డారని, భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని అధికారికంగా నిర్ధారించబడని అలనాటి పండిత్ సుందర్ లాల్ కమిటి నివేదికొకటి వెల్లడిస్తోంది. ఈ కమిటీలో ఉర్దూ పత్రిక పయాం సంపాదకులు ఖాజీ ముహమ్మద్ అబ్దుల్ గఫ్ఫార్, హైదరాబాదుకు చెందిన ప్రముఖ న్యాయవాది యూనుస్ సలీమ్‌లు సభ్యులయ్యారు. ఈ నివేదిక వలన పోలీసు చర్య పేరిట అమాయకుల మీద సాగిన దుష్కృత్యాలన్నీ బయటకు వెల్లడి కావడం ఇష్టంలేని సర్దార్ పటేల్ నివేదికను అధికారికంగా గుర్తించేందుకు నిరాకరించాడు. ఆ కారణంగా ఆ నివేదికలో నిజాలు సూచన ప్రాయంగా వెల్లడి అయ్యేంత వరకు చరిత్రలో మరుగునపడిపోయాయి.

ఆ తరువాత ఆ నివేదిక కాపీని కలిగి ఉన్న కమ్యూనిస్టు నాయకుడు శ్రీనివాస్ లాహోటి దానిని నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ)లో దాఖలు చేసినట్టు 1988లో ఆయన ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వూలో వెల్లడించారు. ఆ విధంగా ఆయన తన ఇంటర్వూలో పండిత్ సుందర్‌లాల్ కమిటీ నివేదిక గురించి వివరంగా ప్రస్తావించడంతో ఆనాటి నివేదినలోని అంశాల గురించి అధ్యాయనం ఆరంభమైంది. ఉర్దూలో ఉన్న ఆ నివేదికలోని కొన్ని భాగాలను పర్శీలించిన హైదరాబాదుకు చెందిన ప్రముఖ రచయిత డాక్టర్ ఉమర్ ఖాలిద్ తాను వ్రాసి, వెలువరించిన హైదరాబాద్ ఆఫ్టర్ ఫాల్ అను గ్రంధంలో పోలీసు చర్య నాటి అకృత్యాలను, అఘాయిత్యాలను కొంత మేరకు ఉటంకించారు. (ముల్కి దస్తర్) ముస్లిం సాహిత్య ప్రత్యేక సంచిక, సంపాదకులు వేముల యల్లాయ్య, స్కై బాబ, డిసెంబరు 2003 మే 2004, హైదరాబాద్). ఆ సమాచారం ప్రకారం చూస్తే ఆనాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నట్లుగా సబ్ ఠీక్ హువా అన్నది ఎంత మాత్రం నిజాం కాదని, పోలీసు చర్య వలన అన్ని వర్గాల ప్రజలు ప్రధానంగా ముస్లింలు అష్టకష్టాలు పడడం, పెద్ద సంఖ్యలో అటు సైన్యం, ఇటు పోలీసుల బారినపడి ఆస్తిపాస్తులతో పాటు ప్రాణాలను కూడా కోల్పోవడం పచ్చి వాస్తవమని తెలుస్తుంది.

చిట్టచివరకు 1948 సెప్టెంబరు 17న నైజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అంగీకరించాడు. హైదరాబాద్

సంస్థానంలో ఆసిఫియ్యా పతాకాన్ని అవనతం చేశారు. 17 సాయంత్రం ఏడు గంటలకు దక్కన్ రేడియో ద్వారా మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ ఇండియన్ యూనియన్‌లో నైజాం సంస్థానం విలీనం విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఆనాడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ చేసిన రేడియో ప్రసంగంలో నా ప్రియమైన ప్రజలారా,... నా ప్రభుత్వం రాజీనామా ఇచ్చింది. అని ప్రకటించారు. ఆ రోజున రజాకార్ల సంస్థను రద్దు చేస్తూ నిజాం సంస్థానాదీశుడు ఉత్తర్వులు జారీచేశాడు. ఈ విలీనం వలన మద్రాసు రాష్ట్రంలో భాగమైన ఆంధ్ర, నైజాం సంస్థానంలో భాగంగా ఉన్న తెలంగాణాలు కలిసిపోయాయి. మద్రాసు రాష్ట్రం నుండి వేరుచేసి తమకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని ఎన్నటి నుండో కోరుతూ వచ్చిన తెలుగు ప్రజల ఆకాంక్షకు తగినట్టుగా ఆంధ్ర రాష్ట్రం మాత్రం ఏర్పడలేదు. మద్రాసు రాష్ట్రంలో భాగంగానే తెలుగు ప్రజలు కొనసాగాల్సిన దుస్థితి అలాగే ఉండిపోయింది. ఈ పరిస్థితి నుండి బైటపడడానికి ప్రజలు మరో ప్రజాపోరు సాగించాల్సి వచ్చింది. ఈ ప్రజాశ్వామిక శాంతియూత పోరాటానికి నాయకుడు పొట్టి శ్రీరాములు చెన్నై లోని బలుసు సాంబమూర్తి గృహంలో 1952 అక్టోబర్ 18 నుండి ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించాడు. ఆనాటి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ప్రజా ఉద్యమాల పట్ల, పొటి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షపట్ల ఏమాత్రం స్పందించకపోవడంతో ప్రజానికం తాడోపేడో తేల్చుకోడానికి సిద్ధమైంది. ఆమరణ నిరాహార దీక్ష వలన పొట్టి శ్రీరాములు పరిస్థితి పూర్తిగా ప్రమాదం అంచుకు చేరుకుంది. చివరికి ఆయన ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తూ 1952 డిసెంబర్ 15 రాత్రి సమయాన కన్ను మూశారు. అమరజీవి ధృఢ నిర్ణయం, తెలుగు ప్రజల ఆందోళన ముందు భారత పాలకులు తలవొగ్గి దిగిరాక తప్పలేదు. 1953 అక్టోబరు ఒకటిన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రుల చిరకాల వాంఛ నెరవేరింది. మద్రాసు ఉమ్మడి రాష్ట్రం నుండి విడవడి తెలుగు ప్రజల సొంత రాష్ట్రం ఏర్పడింది. ఆ తరువాత పరిణామ క్రమంలో 1956 నవంబరు ఒకటిన రాయలసీమ, సర్కారు, కోస్తా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల కలయికతో, భారతదేశంలో ప్రప్రథమ భాషా ప్రయోక్త రాష్ట్రంగా, తెలుగు ప్రజల ప్రదేశంగా ఆంధ్రప్రదేశ్ భారతదేశ చిత్రపటం మీద నూతన రాష్ట్రంగా అవతరించింది.

ప్ర: జమ్‌జమ్ త్రాగేటప్పుడు ఏ దువా చదవాలి?

జ: హజ్రత్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనానుసారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు జమ్‌జమ్ త్రాగినప్పుడు ఈ దువా చేసేవారు:

اللَّهُمَّ إِنِّي أَسْأَلُكَ عِلْمًا نَافِعًا وَرِزْقًا وَاسِعًا وَشِفَاءً مِنْ كُلِّ دَاءٍ

అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక ఇల్‌మన్ నాఫిఅ, వ రిజ్‌కన్ వాసిఅ, వ షిఫాఅమ్ మన్ కుల్లి దా.

– (సుననే దారకుత్నీ: 2738)

ప్ర: మా చెల్లి పేరున ఓ ఇల్లు కొన్నాము. రిజిస్ట్రేషన్ తరువాత ఆమెకు పెరాలసిస్ వచ్చింది. ఇది ఆ ఇల్లు కొనడం వల్ల వచ్చిందని ఆమె భావిస్తుంది. ఇది ఎంతవరకు నిజం?

జ: ఇది ముమ్మాటికీ వాస్తవం కాదు. ఇళ్ళు కొనడం వల్ల లేదా ఇంకేమైనా చేయడం వల్ల ఎలాంటి కీడు జరుగదు. ఇది హిందూ సోదరుల నుండి మనకు సోకిన మూఢ నమ్మకాలలో ఒకటి. ఇస్లాంలో వీటికి స్థానం లేదు. మంచి జరిగినా చెడు జరిగినా అది అల్లాహ్ నిర్ణయం ప్రకారం జరుగుతుంది. ఒక సారి మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి కుమారుడు చనిపోగ అదే రోజున సూర్య గ్రహణం సంభవించింది. అందరూ అది ప్రవక్త స.అ గారి కుమారుడు మరణించడం వల్ల సంభవించిందని భావించారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు వారి ఈ అపోహను దూరం చేస్తూ ఇలా అన్నారు:

إِنَّ الشَّمْسَ وَالْقَمَرَ لَا يَخْسِفَانِ لِمَوْتِ أَحَدٍ، وَلَا لِحَيَاتِهِ، وَلَكِنَّهُمَا آيَةٌ مِنْ آيَاتِ اللهِ تَبَارَكَ وَتَعَالَى، فَإِذَا رَأَيْتُمُوهُمَا فَصَلُّوا

ఎవరి జనన మరణాలకు సూర్య, చంద్ర గ్రహణాలకు ఎటువంటి సంబంధం లేదు. అవి అల్లాహ్ యొక్క సూచనలలో ఒకటి. మీరు గ్రహణాన్ని చూసినప్పుడు నమాజు చేయండి.

మీ సోదరీమణికి ఒక విషయం చెప్పండి. ఆపదలు, బాధలతో అల్లాహ్ అందరినీ పరీక్షిస్తాడు. ఎవరైతే ఇటువంటి పరిస్థితులలోనూ అల్లాహ్‌ను విశ్వసించి వారి వైపుకు వస్తారో వారు ఈ పరీక్షలో నెగ్గుతారు. ఇటు వంటి మూఢ నమ్మాలు వ్యక్తం చేసేవారు విఫలమౌతారు. అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఈ విధంగా సెలవిస్తున్నారు:

భయం, ఆకలి, ధనప్రాణ, పంట నష్టాలు కలిగించి మిమ్మల్ని మేము తప్పనిసరిగా పరీక్షిస్తాము. అలాంటి స్థితిలో సహనం వహించి, "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" (మేము అల్లాహ్ దాసులం, ఒకానొక రోజు అల్లాహ్ వద్దకే తిరిగి వెళ్ళిపోవాల్సినవాళ్ళం) అని పలికేవారికి వారి ప్రభువు కారుణ్య కటాక్షాలు లభిస్తాయని శుభవార్త వినిపించండి. అలాంటివారే సన్మార్గులు.

(సూరే బఖరా: 155–157)

Printed, published and owned by Mohd Abdul Qavi,
17-1-391/M/13, Khaja Bagh, Saidabad colony, Hyderabad-59.
Published from Idara Ashraful Uloom Trust,
17-1-391/M/13, Khaja Bagh, Saidabad, Hyderabad-59.
Printed at printline printers,
3-6-753/1, Himayath Nagar, Hyderabad-29.
Editor; Mohammed Omar Farooq.